

బీచ్ రెస్టారెంట్ల బరితెగింపు

ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మాణాలు



నేరెళ్లవలసలోని మేర్లిన్ కే రెస్టారెంట్



కాపులుప్పాడలోని విరాగో...



తొట్లకొండ వద్ద వున్న శాంక్టమ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులో వెలసిన రెస్టారెంట్లు ఏవీ నిబంధనలు పాటించడం లేదు. జీవీఎంసీ నుంచి అనుమతులు లేకుండానే నిర్వాహకులు నిర్మాణాలు చేపడుతున్నారు. ఏ చట్టబద్ధ సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండానే భారీ వ్యాపారాలు చేస్తున్నారు. కేవలం ట్రేడ్ లైసెన్స్ అడ్డం పెట్టుకొని భారీ దందా చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, భారీ నజరానాలతో ఇన్నాళ్లూ కళ్లు మూసుకున్న అధికారులు హైకోర్టు ఆదేశంతో వాటిపై విచారణ చేపట్టారు. ఫిర్యాదు అందిన రెస్టారెంట్లన్నీ అక్రమేనని తేల్చారు. మరి ఇన్నాళ్లు ఎందుకు వారిపై చర్యలు చేపట్టలేదనేది అధికారులే చెప్పాలి.

- అడ్డగోలుగా భూగర్భ జలాల వినియోగం
- శుద్ధి చేయకుండానే సముద్రంలోకి వ్యర్థ జలాలు విడుదల
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న జీవీఎంసీ
- హైకోర్టు ఆదేశంతో వెలుగులోకి అక్రమాలు
- జాబితాలో 'సీహార్స్', విరాగో, 'తీరం రెస్టారెంట్', శాంక్టమ్, మేర్లిన్ కే

ముఖ్యంగా భీమిలి మండలంలో సముద్ర తీరాన్ని ఆనుకొని ప్రముఖ రెస్టారెంట్లు ఉన్నాయి. కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) పరిధిలో ఏదైనా నిర్మాణం చేపడితే ముందుగా ఆంధ్రప్రదేశ్ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ)కి దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలి. వారు ఎన్‌ఓసీ ఇచ్చాకే పనులు ప్రారంభించాలి. సీఆర్‌జెడ్‌లో నిర్మాణాలకు అవసరమైన నీటి కోసం బోర్లు తవ్వకూడదు. వ్యర్థ జలాలను శుద్ధి చేశాకే బయటకు పంపాలి. అయితే ఏ రెస్టారెంట్ కూడా ఈ నిబంధనలు పాటించడం లేదు. పైగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేశారు. వీటిపై జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్, మత్స్యకార సంఘ నాయకులు తెడ్డు శంకరరావు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. మూర్తి యాదవ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం వేశారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె కూడా ఇలాగే భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణం చేపట్టగా దానిపై హైకోర్టు విచారించి, కూల్చివేయాల్సిందిగా ఆదేశించింది. ఆ క్రమంలో నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటుచేసి, ఫిర్యాదు అందిన ఐదు రెస్టారెంట్ల నిబంధనల ఉల్లంఘనపై నివేదిక కోరింది. జీవీఎంసీ ఏమి చర్యలు చేపట్టిందో నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించింది. వీరి విచారణలో అసలు బాగోతాలు బయటపడ్డాయి.

పగ్గాలు లేని సీహార్స్

భీమిలి మండలం నేరెళ్లవలస సర్వే నంబరు 39/5సిలోని 33 సెంట్ల జిరాయితీ భూమిలో సీహార్స్ రెస్టారెంట్‌ను నిర్మించారు. ఆ తరువాత దీని పేరు జీ బ్యాగ్‌గా మార్చారు. ఇక్కడ 410 చ.మీ. విస్తీర్ణంలో అక్రమ నిర్మాణం ఉందని తేల్చారు. అక్కడ నిర్మాణాలు గుర్తించిన జీవీఎంసీ 16-6-2021న తొలగించాలని నోటీసు ఇచ్చింది. ఆ తరువాత పనులు ఆపాలని కోరింది. దాంతో వారు హైకోర్టుకు వెళ్లి రిట్ పిటిషన్ వేసి 3074/2024 ద్వారా స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. ఇది సీఆర్‌జెడ్-3లో ఉంది. అందులో హోటల్/రెస్టారెంట్ నిర్మించకూడదు. కానీ కట్టారు. అడ్డగోలుగా బోరు వేశారు. వినియోగించిన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా విడిచిపెడుతున్నారు. హైకోర్టు స్టే ఎత్తివేస్తే తప్ప దీనిపై చర్యలు తీసుకునే వీలే లేదు.

విరాగోకి ఎన్‌ఓసీ నిరాకరణ

భీమిలి మండలం కాపులుప్పాడ సర్వే నంబరు 328-14, 18, 329-5లలో 285 సెంట్లలో విరాగో రెస్టారెంట్ ఏర్పాటైంది. జి ప్లస్ వన్ నిర్మాణానికి 2022లో ఒమ్మి అప్పారావు, సన్యాసిరావులు దరఖాస్తు చేశారు. దీనికి ఎన్‌ఓసీ ఇవ్వడానికి ఏపీసీజెడ్ఎంఏ నిరాకరించింది. ఏసీసీ నిర్మాణాలు ... మిగతా 6వ పేజీలో

మరో 4 వారాలు గడువివ్వండి

- భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపునకు సమయం ఇవ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని అభ్యర్థించిన జీవీఎంసీ
- తీరం వెంబడి అనుమతులు లేకుండానే రెస్టారెంట్లు నిర్మించినట్టు నివేదిక

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి భీమిలి బీచ్‌లో నిర్మించిన పునాదులను తొలగించడానికి మరో నాలుగు వారాల సమయం కావాలని జీవీఎంసీ అధికారులు హైకోర్టును కోరారు. ఇప్పటివరకూ చేపట్టిన పనులపై నివేదిక అందజేశారు. నేహారెడ్డి 588 మీటర్ల మేర ప్రహరీ నిమిత్తం పునాదులు నిర్మించగా, అందులో ఇప్పటివరకూ 361 మీటర్లు తొలగించామని పేర్కొన్నారు. ఇసుకలో లోతుగా పునాదులు ఉండడం వల్ల ఐదు బ్రేకర్లు, రెండు ఎక్స్‌కవేటర్లు ఉపయోగిస్తున్నామని, డెబ్రిస్‌ను దూరంగా తరలించడానికి సమయం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. కష్టతరమైన పని కావడంతో మరికొంత గడువు కావాలని కోరారు. భీమిలి మండలంలో తీరం వెంబడి నిర్మించిన ... మిగతా 6వ పేజీలో



బీచ్‌లో నేహారెడ్డి నిర్మించిన పునాదులు తొలగిస్తున్న దృశ్యం

పరిశ్రమల కోసం 1000 ఎకరాలు

- నియోజకవర్గానికొక ఎంఎస్ఎంఈ పార్కు
- మెట్రో రైలు మొదటి దశ నిర్మాణానికి అవసరమైన భూమిని ఆరు నెలల్లో అప్పగిస్తాం
- జీవీఎంసీ పరిధిలో ఐదుచోట్ల వర్కింగ్ విమెన్ హాస్టళ్లు
- వచ్చే జూన్ నాటికి మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం పూర్తి



సీఎంతో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ

సీఎంకు నివేదిక ఇచ్చిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి కోసం వేయి ఎకరాలను గుర్తిస్తున్నామని, నగరానికి దగ్గరగా, రహదారి సౌకర్యం ఉన్న భూములనే ఎంపిక చేస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అమరావతిలో మంగళ, బుధవారాల్లో ముఖ్యమంత్రి, మంత్రుల సమక్షంలో సమావేశంలో జరగనున్న సమావేశాల్లో ... మిగతా 6వ పేజీలో

ప్రత్యేక డ్రగ్ డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటుచేయాలి

సీపీ శంఖబ్రతబాగ్చి సూచన

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, మత్తుమందులు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారి సంఖ్య పెరిగినందున, వారిని అందులో నుంచి బయటపడేసేందుకు ప్రత్యేక డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలతో అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెకర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ విశాఖ జిల్లాలో గంజాయి వినియోగం పెరిగిపోతున్నందున డ్రగ్ డి అడిక్షన్ సెంటర్లను పెంచాలని కోరారు. దీనికి అనుబంధంగా సీపీ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ అన్నింటికీ ఒకే విధమైన చికిత్స, కౌన్సెలింగ్ కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒక్కో డ్రగ్‌కు ఒక్కో రకమైన ట్రీట్‌మెంట్ అవసరమని, అలా చేస్తేనే ఉపయోగం ఉంటుంది కాబట్టి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఏ ప్రాంతంలో ఏ డ్రగ్‌ను ఎక్కువగా వాడుతున్నారనే దానిపై సర్వే చేసి, మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత ఎక్కడ ఎలాంటి డీ అడిక్షన్ సెంటర్ అవసరమైతే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చునని సీఎం చంద్రబాబు అన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.12 (బుధవారం సాయంత్రం)
సహర్ : 4.38 (గురువారం ఉదయం)

బడ్జెట్‌పై మహా ఉత్కంఠ

సమావేశంపై సందిగ్ధం

- మేయర్‌పై అవిశ్వాసం కోరుతూ నోటీస్ ఇచ్చిన కూటమి
- తమ పార్టీ కార్పొరేటర్లను బెంగళూరు తరలించిన వైసీపీ
- అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరిగే రోజునే తిరిగి నగరానికి తీసుకువస్తామంటున్న నేతలు
- మేయర్ గైర్హాజరైతే బడ్జెట్ సమావేశం ఎలా నిర్వహించాలనే అంశంపై అధికారుల సమాలోచన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ బడ్జెట్ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. ఈనెల 29న సమావేశ నిర్వహణకు అధికారులు ఒక వైపు ఏర్పాటుచేస్తుండగా, మరోవైపు మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి కూటమి నేతలు నోటీస్ ఇచ్చారని వైసీపీ నేతలు తమ పార్టీ కార్పొరేటర్లను బెంగళూరు తరలించేశారు. అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినప్పుడే వారందరినీ నగరానికి తిరిగి తీసుకువస్తామని వైసీపీ నేతలు చెబుతున్నారు. మేయర్ కూడా బెంగళూరులోనే ఉండిపోతే ఈనెల 29న జరగాల్సిన బడ్జెట్ సమావేశం పరిస్థితి ఏమిటనే దానిపై సందిగ్ధత నెలకొంది.

జీవీఎంసీ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశాన్ని ఈనెల 29న నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు ఇప్పటికే సభ్యులందరికీ బడ్జెట్ ముసాయిదాతోపాటు సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని అందజేశారు. ఈనెల 31లోపు బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందకపోతే ఏప్రిల్ ఒకటి నుంచి జీవీఎంసీ సాధారణ ఖర్చులకు కూడా నిధులు అందుబాటులో ఉండని పరిస్థితి వస్తుంది. అందువల్లే ఆగమేఘాల మీద 29న బడ్జెట్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశం నిర్వహణకు అధికారులు ఒకవైపు ఏర్పాట్లు చేస్తుండగానే, మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ కూటమి కార్పొరేటర్లంతా జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు నోటీసు అందజేశారు. దీంతో వైసీపీ నేతలు అప్రమత్తమయ్యారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే జీవీఎంసీలో మొత్తం ఓటింగ్ సభ్యులుగా ఉన్న 111 మందిలో 74 మంది ఓటెయ్యాలి. అయితే కూటమికి ఇప్పటికే 75 మంది (11 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు, 64 మంది కార్పొరేటర్లు) బలం ఉంది. తమకు 31 మంది ... మిగతా 6వ పేజీలో

ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

ఆస్తి పన్ను, వీఎల్‌టీ (ఖాళీ స్థలాలపై పన్ను) బకాయిల చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసిందని జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నగర పరిధిలోని గృహ యజమానులు, స్థలాలు కలిగినవారు ప్రభుత్వం కల్పించిన ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఇంకా చెల్లించనివారు మొదటి అర్థ సంవత్సరం పన్నుపై వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని, అలాంటి వారంతా సంవత్సరం పన్నును ఈనెల 31లోపు ఒకేసారి చెల్లిస్తే...వారికి వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుందని జీవీఎంసీ రెవెన్యూ విభాగం డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే గత కొన్నేళ్లుగా పన్ను చెల్లించకుండా ఉండిపోయినవారు ఈనెల 31లోగా మొత్తం చెల్లించేస్తే వడ్డీలో 50 శాతం మినహాయింపు వర్తిస్తుందని వివరించారు. ఆస్తి పన్నును అన్ని జోనల్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాలతోపాటు సిరిపురంలోని ఐడీబీఐ బ్యాంక్, ద్వారకానగర్ ఐసీఐసీఐ బ్యాంక్, రామ్‌నగర్‌లోని యాక్సిస్ బ్యాంకుల్లో చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే వార్డు సచివాలయాల వద్ద కూడా పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు.

కేజీహెచ్‌లో వైద్యుల కక్కుర్తి

- డయాగ్నోస్టిక్ సెంటర్‌లతో ఒప్పందాలు
- ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ వంటి పరీక్షలు బయట చేయించుకోవాలంటూ రోగులపై ఒత్తిడి
- సెంటర్‌ల నిర్వాహకుల నుంచి 40 నుంచి 50 శాతం మేర కమీషన్
- ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకుంటే రిపోర్టులు చూసేందుకు ఆసక్తి చూపించని పరిస్థితి
- తమ క్లినిక్‌లకు వచ్చేయాలంటూ రోగులకు సూచిస్తున్న మరికొందరు వైద్యులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేజీహెచ్‌లో కొందరు వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడు తున్నారు. ముఖ్యంగా మూడు, నాలుగు విభాగాలకు చెందిన వారు బయట మెడికల్ సెంటర్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ వంటి పరీక్షలను తమ చెప్పినచోట చేయించుకోవాలంటూ రోగులకు సూచిస్తున్నారు. ఈ పరీక్షలు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ ఉంటాయి. తమ వద్ద పరీక్షలకు సిఫారసు చేసినందుకు సదరు వైద్యులకు మెడికల్ సెంటర్లు 40 నుంచి 50 శాతం వరకూ కమీషన్ చెల్లిస్తున్నట్టు చెబుతున్నారు. ఒకవేళ వేరొక చోట పరీక్షలు చేయించుకుంటే రిపోర్టులను చూసేందుకు కొందరు వైద్యులు ఇష్టపడడం లేదు. అందులో స్పష్టత లేదని, ఫలానా మెడికల్ సెంటర్‌లో చేయించుకోవాలని పంపిస్తున్నారు. కేజీహెచ్‌లో రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉన్నా, వైద్యులు కొందరు వేల రూపాయలు పెట్టి పరీక్షలు బయట చేయించుకోవాలని పంపుతుండడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్యులు చూసుకునే వెసులుబాటు

ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ వంటి పరీక్షలను కేజీహెచ్‌లో ఉచితంగా చేస్తారు. ఫిల్మ్ మాత్రం కొన్నాళ్లుగా రోగులకు ఇవ్వడం లేదు. కానీ, రిపోర్టులను రోగులకు అందిస్తున్నారు. అలాగే, ఆన్‌లైన్‌లో సంబంధించిన ఇమేజ్‌లను వైద్యులకు పంపిస్తున్నారు. వీటిని కంప్యూటర్‌లో వైద్యులు పరిశీలించి రోగులకు అవసరమైన మందులు ఇవ్వవచ్చు. కానీ, కొందరు వైద్యులు వాటిల్లో స్పష్టత లేదంటూ బయటకు వెళ్లి పరీక్షలు చేయించుకోమంటున్నారు.

ప్రైవేటు రోగులు

ఇక కొన్ని విభాగాలకు చెందిన వైద్యులైతే రోగులను తమ క్లినిక్‌లు, ఆస్పత్రులకు ... మిగతా 6వ పేజీలో



జోన్ కార్యాలయానికి కేటాయించిన భూమిలో పనులను అడ్డుకుంటున్న స్థానికులు

రైల్వే జోన్ పనులను అడ్డుకున్న గిరిజనులు

- ఆ భూములను గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ వాదన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవాలన్న కాంట్రాక్టు కంపెనీ సిబ్బంది

ఆరిలోవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

దక్షిణ కోస్తా రైల్వే జోన్ డివిజన్ కార్యాలయ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న పనులను స్థానిక గిరిజనులు మంగళవారం అడ్డుకున్నారు. తమకు ప్రభుత్వం కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నగర పరిధిలోని చినగదిలి మండలం ముడసర్లోవ రిజర్వాయర్‌కు సమీపంలో సుమారు 52 ఎకరాలను ... మిగతా 6వ పేజీలో

స్టార్టప్ పాలసీతో వినూత్న మార్పులు

ఐటీ పరిశ్రమ హర్షం

- రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారానే కార్యక్రమాలు
- అమరావతి, విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలలో సబ్ సెంటర్లు
- 30 మంది ఉద్యోగుల వరకూ 100 శాతం అద్దె రాయితీ



విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ ఐటీ రంగంలో వినూత్నమైన మార్పులకు దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా అనుకున్న లక్ష్యం సాధించాలని ప్రభుత్వం పాలసీని రూపొందించింది. విజయవాడలో ఆ సెంటర్‌ను ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా మరో ఐదు సబ్ సెంటర్లను విశాఖపట్నం, అమరావతి, రాజమండ్రి, తిరుపతి, అనంతపురాల్లో ఏర్పాటు చేస్తామని పేర్కొంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పూర్తిగా ప్రైవేటుకు అప్పగించి అన్ని కార్యక్రమాలు అక్కడి నుంచే అమలయ్యేలా చేయనున్నారు. ఈసారి ఇన్నోవేషన్, స్టార్టప్‌లకు ఒక్క ఐటీ శాఖ నుంచే కాకుండా గుర్తించిన 15 శాఖల నుంచి రూ.10 కోట్లకు తక్కువ లేకుండా నిధులు ఇచ్చేలా నిబంధనలు పెట్టారు.

స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- మంచి ఐడియాతో ... మిగతా 6వ పేజీలో

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్

- ఎన్‌ఆర్‌ఐ సంబంధాల పేరుతో వల
- వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ ఆధారంగా సైబర్ నేరగాళ్ల మోసాలు -8లో





ఉభయ దేవేరులతో సింహాచలేశుడు

వైభవంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అర్చకులు పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణాన్ని జరిపారు.

వెంకన్న సన్నిధిలో నక్షత్ర హవనం



హవనం చేస్తున్న వైదికులు

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థాన అనుబంధ ఆలయంగా కొండదిగువ పూదోటలో ఉన్న పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధానంలో సంప్రదాయబద్ధంగా శ్రవణ నక్షత్ర హవనాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశాక యజ్ఞపురుషుడుగా సుదర్శన పెరుమాళ్‌ను యాగశాలలోని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అర్చకులు పద్మహాస చక్రవర్తి లోక కల్యాణార్థం అనే సంకల్పంతో హవనానికి శ్రీకారం చుట్టి పూజాది కార్యక్రమాలను జరిపారు. హోమకుండంలో అగ్ని ప్రతిష్ఠ చేసి సుదర్శన శతకంతో హవనాన్ని చేపట్టారు. భక్తులకు హోమ భస్మాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాన్ని దేవస్థానం స్థానాచార్యులు డాక్టర్ టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో నిర్వహించారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

భీమునిపట్నం (రూరల్) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిప్పాడ, తాటితూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సన్నిహి సంస్థ మంగళవారం పలు ఉపకరణాలను పంపిణీ చేసింది. చిప్పాడలో 81 మందికి, తాటితూరులో 92 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, డ్రాయింగ్ వేసుకునేందుకు రెండు వర్క్ బుక్‌లు, పెన్నులను అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

రీ-సర్వేపై అవగాహన ర్యాలీ

ఆనందపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా రీ-సర్వేకు సహకరించాలని ఆనందపురం తహశీల్దార్ శ్యాంప్రసాద్ కోరారు. మండలంలోని గిడిజాల గ్రామంలో మంగళవారం సచివాలయం నుంచి గ్రామం చివరివరకు రీ-సర్వే అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం పది గంటలకు రీ-సర్వేపై నిర్వహించే గ్రామ సభలో గ్రామస్థులంతా పాల్గొని సందేహాలు నివృత్తిచేసుకోవాలన్నారు. రీ-సర్వేలో పాల్గొనే రెవెన్యూ సిబ్బందికి గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు డివిజనల్ సర్వే అధికారి కొండలరావు, రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ గోవింద్, మండల సర్వేయర్ అప్పన్న, సర్పంచ్ అప్పలరాజు, గ్రామ పెద్దలు ఘట్టమనేని సుబాశ్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లవలసలో..

భీమునిపట్నం (రూరల్): మండలం లోని తాళ్లవలసలో భూముల రీ-సర్వే గ్రామ సభను నిర్వహించారు. తహశీల్దారు రామారావు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రామంలో 1412 ఎకరాలను సర్వే చేయడానికి ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సర్వే పూర్తయ్యాక గ్రామంలో రైతులతో మళ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడిస్తామన్నారు. సర్వే సందర్భంగా గ్రామంలో రైతులతో ర్యాలీని కూడా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

పాండ్రంగి, కొవ్వాడ గ్రామాల్లో...

పద్మనాభం: రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మంగళవారం మండలంలోని పాండ్రంగి, కొవ్వాడ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. తహసీల్దారు కె.ఆనందరావు ఆధ్వర్యంలో ఆ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేస్తూ ఏప్రిల్ 2 నుంచి నిర్వహించే రెండో విడత రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసర్వే సందర్భంగా గ్రామంలోకి వచ్చే వీఆర్వోలు, సర్వేయర్లకు తమ భూముల వివరాలను తెలియజేసి నమోదు చేసుకోవాలని తహసీల్దారు ఆనందరావు సూచించారు. రెండో విడతలో ఈ రెండు గ్రామాలలో రీ-సర్వే జరుగుతుందన్నారు.ఇప్పటికే గంధవరంలో సర్వే పూర్తయిందన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వరలక్ష్మి, ఆర్ఐ శ్యామల, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు రఘు, స్వామి, అప్పలరాజు ఆయా గ్రామాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

జడ్పీ అతిథి గృహాన్ని పరిశీలించిన చైర్‌పర్సన్

శిథిలమైన గెస్ట్ హౌస్‌కు మరమ్మతులు లేదా పునర్నిర్మాణానికి అంచనాలను రూపొందించాలని ఆదేశించిన సుభద్ర



జడ్పీ గెస్ట్ హౌస్‌లోని హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

భీమునిపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో శిథిలావస్థకు చేరిన జడ్పీ అతిథి గృహాన్ని మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సందర్శించారు. గెస్ట్‌హౌస్ లోపల సూట్ రూమ్‌లను, హాల్‌ను, ఆవరణలో పాడైన శ్లాబ్‌లను పరిశీలించారు. దీనిని నిర్మించి సుమారు 40 ఏళ్లు అవుతున్నందున మరమ్మతులు చేయడానికి అవకాశాలు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే దీనిని కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు అయ్యే వ్యయంపై అంచనాలను రూపొందించాలన్నారు. గెస్ట్‌హౌస్‌ను ఆనుకుని నిర్మించిన హాల్ నిర్మాణ బాగానే ఉన్నందున పునర్నిర్మాణానికి తగిన ప్రతిపాదనలను రూపొందించాలని పంచాయతీరాజ్ డీఈ జగదీశ్‌బాబును ఆదేశించారు.

అనంతరం సుభద్ర మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించగా జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీడీవో ఎన్.హనుమంతరావు, తదితరులు ఆమెను పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ ఆవరణలో కొత్తగా కార్యాలయాల నిర్మాణం గురించి ఆమెకు జడ్పీటీసీ వివరించారు. ఆ తర్వాత ఆమె శ్రీనూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. చైర్‌పర్సన్ వెంట సింగనబంధ సర్పంచ్ జీవీ నారాయణ, నాయకులు గాడు తాతినాయుడు, కె.సన్యాసినాయుడు, ఈవోపీఆర్డీ రమేశ్‌నాయుడు, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు ఉన్నారు.

నూకాలమ్మ పండగకు ముస్తాబవుతున్న భీమిలి



భీమునిపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రజల ఆరాధ్య దేవత శ్రీనూకాలమ్మ పండగకు సమయం సమీపిస్తుండడంతో పట్టణం శోభాయమానంగా ముస్తాబవుతుంది. ఇందులో భాగంగా ఇక్కడి పాత బస్టాండ్ వద్ద భారీ ఎత్తున హనుమాన్ సెట్‌తో కూడిన స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు అయోధ్య జైశ్రీరామ్ సెట్‌లను తీర్చిదిద్దారు.

పట్టణంలోని మెయిన్ రోడ్డుతో పాటు చిన్న బజారులోని అమ్మవారి ఆలయం వద్ద భారీ స్వాగత ద్వారాలను ఏర్పాచే చేస్తున్నారు. ఇప్పటికే నూకాలమ్మ ఆలయానికి పెయింటింగ్స్ వేసి విద్యుత్ లైట్లతో సుందరమయంగా తయారుచేశారు. అదేవిధంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో పట్టణం అందంగా రూపుదిద్దుకుంటుంది. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు.

'అన్నదానం ఎంతో గొప్పది'



అన్నదానంలో పాల్గొన్న గరే గురునాథ్

కొమ్మాది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని తెలుగు యువత విశాఖ ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ అన్నారు. మంగళవారం పీఎంపాలెంలో పైడితల్లమ్మ పండగ ముగింపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంపాలెం హెచ్‌ఆర్‌సీ కాలనీలో గల పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్న సమారాధనను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే గాయత్రీనగర్‌లో అమ్మవారి పండగ సందర్భంగా పద్మశాలి బోర్డు డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కొత్త అంశాలను నేర్చుకునేందుకు వయసు అడ్డంకి కాదు

గీతం ప్రోవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు

సాగర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కొత్త అంశాలను నేర్చుకునేందుకు వయసు అవరోధం కాదని గీతం ప్రోవైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు అన్నారు. ప్రముఖ ఔషధ పరిశ్రమ అరబిందో ఫార్మా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ఎపిటోరియా ఫార్మాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎండీపీ) మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లోని నిపుణులకు సమకాలీన అంశాలపై శిక్షణ ఇవ్వడం సంస్థల ప్రగతికి ఉపకరిస్తుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు స్నాతకోత్సవ తరహాలో కార్యక్రమాన్ని నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. ఎపిటోరియా ఫార్మా సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ యు.ఎన్.బి.రాజు, ఆపరేషన్స్ విభాగం ఉపాధ్యక్షుడు రంగారావు, జీఎస్బీ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, తదితరులు పాల్గొన్నారు.

బోయవీధిలో తాగునీటి సరఫరా ప్రారంభం

భీమునిపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 3వ వార్డు పరిధి బోయవీధిలో ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ.మూడు లక్షల వ్యయంతో నిర్మించిన పైలట్ వాటర్ సప్లై స్కీమ్‌ను మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి మత్స్యకారులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్టు కార్పొరేటర్ గంటా అప్పలకొండ దృష్టికి తీసుకురావడంతో సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు తెలియజేశామన్నారు. ఆయన నిధులు మంజూరు చేయించడంతో సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో బోయవీధి పెద్దలు కె.దుర్గారావు, కె.కాశీడు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు వి.సత్యారావు, జాలారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.నూకరాజు, మాజీ కౌన్సిలర్ కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పింఛన్ల పెంపునకు రాజకీయ పార్టీలు కృషి చేయాలి

జూట్ మిల్లు పింఛన్ కార్మికుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న దామోదర బాబాజీ, సంఘం ఇతర నేతలు

తగరపువలస, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పింఛను కేవలం రూ.వెయ్యి మాత్రం అందుతోందని, అది కూడా చాలామంది కార్మికులకు అందడం లేదని జూట్ మిల్లు పింఛను కార్మికుల సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం చిట్టివలసలో జరిగిన ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు దామోదర బాబాజీ అధ్యక్షత వహించారు. వివిధ కర్మాగారాల్లో పనిచేసిన ఇటువంటి కార్మికులు 3 లక్షల మంది దేశవ్యాప్తంగా ఉన్నారని, వీరికి 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీయే ప్రభుత్వం రూ. 3 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించిందని, కానీ అమలు చేయలేదన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు లేకుండా వారి ఆధార్‌కార్డు ఆధారంగానే రూ.4 వేలు చొప్పున సామాజిక పింఛన్లు ఇస్తున్నదని, కానీ వివిధ కర్మాగారాల్లో పనిచేసి వృద్ధాప్యంలోకి వచ్చిన వీరిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్మిక పింఛనుదారులకు రూ.9 వేలు కనీస పింఛనుగా చెల్లించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ 196 రకాల పరిశ్రమల్లో పని చేస్తున్న వారి నుంచి పీఎఫ్ వసూలు చేశారని, వారిని ఈపీఎఫ్ పింఛనుదారులుగా పిలుస్తుంటారని అన్నారు. వీరికి ప్రభుత్వ లెక్కల ప్రకారం చెల్లిస్తున్న పింఛను చాలా తక్కువగా ఉందని, కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి చేసి వీరి పింఛన్లు పెంచాలని కోరారు. వీరికి వైద్య, ఉచిత రవాణా సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నేతలు చిల్ల అప్పారావు, మోర అప్పలరాజు, పంపాన సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. సమావేశం అనంతరం విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు టీపీపీ స్థానిక కార్యదర్శి పిట్ట సురేష్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. పార్లమెంటులో ఈ విషయాన్ని లేవనెత్తాలని కోరారు.

31న శ్రీకాకుళంలో ఉపాధ్యాయుల 'పోరుబాట' సదస్సు

తగరపువలస, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై చర్చించడానికి ఈ నెల 31న శ్రీకాకుళంలో బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో పోరుబాట పేరుతో సదస్సును నిర్వహిస్తున్నట్టు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారి కె.మోహనరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం చిట్టివలస సీఐటీయూ కార్యాలయం వద్ద జరిగిన ఉపాధ్యా యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ.. గతంలో వైసీపీ ప్రభుత్వం 117 నంబరు గల ఉత్తర్వులను విడుదల చేసి పాఠశాలల్ని నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం కూడా ఆ జీవోలో ఉన్న విషయాలనే కొన్ని సవరించి అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. రానున్న కాలంలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఏర్పడనుందని అన్నారు. పే రివిజన్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీ ఎల్ఐ, కరువుభత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశానికి అనకాపల్లి పైడిరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ వైఎ ఆర్యే. ప్రసాద్ సత్యనారాయణ, సంతోష్‌కుమార్‌లతో పాటు నాయకులు మూర్తి,అప్పలనాయుడు పాల్గొన్నారు.

పరిశ్రమల కోసం 1000 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

సమర్పించేందుకు జిల్లాకు సంబంధించి ఆయన ఒక నివేదిక రూపొందించారు. జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నదీ అందులో వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు పెడతామన్నారు. వాటికి ఏయూలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సహకరిస్తుందని, దీనివల్ల 300 స్టార్టప్‌లు, 1,800 మందికి నేరుగా ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. ఐఐఎం ఇంకుబేషన్, స్టార్టప్ హబ్‌లో 300 స్టార్టప్‌లకు సహకారం అందిస్తామన్నారు.

- పీఎం సూర్యఘర్ కింద 7,500 సోలార్ రూఫ్‌టాప్‌లు అమరుస్తున్నామన్నారు. ఆరింటిని మోడల్ సోలార్ గ్రామాలుగా మారుస్తామన్నారు. సుమారు 98 ఎకరాలలో 5 సోలార్ ప్లాంట్లను 9.47 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే మరో 100 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సీఎన్‌జీ అమ్మకాలు పెంచడానికి కొత్తగా 5 రిటైల్ అవుట్‌లెట్లు పెడతామన్నారు.
- మెట్రో రైలు మొదటి దశ నిర్మాణానికి అవసరమైన భూమిని ఆరు నెలల్లో అప్పగిస్తామని హామీ ఇచ్చారు.
- భోగాపురం విమానాశ్రయం ట్రాఫిక్‌ను తట్టుకోవడానికి 15 మాస్టర్ ప్లాన్ రహదారులను 72.82 కి.మీ. పొడవున రూ.392.89 కోట్లతో నిర్మించనున్నామని, వీటిని వచ్చే జూన్ నాటికి పూర్తిచేస్తామన్నారు.
- జీవీఎంసీ పరిధిలో పనిచేసే మహిళల కోసం ఐదు ప్రాంతాల్లో వర్కింగ్ విమెన్ హాస్టళ్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు. వీటిద్వారా 1,150 మందికి ఆశ్రయం లభిస్తుందన్నారు.
- మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థను రూ.643 కోట్లతో చేపట్టనున్నామని వెల్లడించారు.
- పరదేశిపాలెంలో కాలేజీ విద్యార్థినులకు రూ.70 లక్షలతో హాస్టల్ భవనం నిర్మిస్తామన్నారు.
- కేజీహెచ్ ఓపీ బ్లాక్, క్యాజువాలిటీని కోటి రూపాయలతో ఆధునీకరించనున్నట్టు పేర్కొన్నారు.
- త్వరలోనే విశాఖ పోర్టులో క్రూయిజ్ టూరిజం ప్రారంభం కానుందని, బీచ్‌లో హోప్ ఆన్, హోప్ ఆఫ్ బస్సు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ



పూజల్లో పాల్గొన్న భక్తులు

పద్మనాభం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ పరిధి విజయానందపురంలో పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఘటాలను ప్రధాన వీధులలో ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 40 మంది దరఖాస్తు

మధురవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం పొందడానికి 40 మంది దరఖాస్తు చేశారు. ఈ వార్డు పరిధిలోని పలువురు వెనుకబడిన వర్గాలకు చెందిన వారు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోడానికి వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు తదితరులు ప్రోత్సహించారు. వీరి దరఖాస్తులను జీవీఎంసీ ఏపీడీవోకు మంగళవారం పిళ్లా వెంకటరావు తదితరులు అందించారు.

బీచ్ రెస్టారెంట్ల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చేపడుతుంటే జీవీఎంసీ పనులు ఆపాలని కోరింది. ఆ తరువాత దానిని మద్దిపాటి శిరీష లీజుకు తీసుకుని జీవీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారు. అలాగే ఎక్సైజ్ నుంచి లిక్కర్ లైసెన్స్ పొందారు. ఇది సీఆర్‌జెడ్-3లో ఉంది. హోటల్, రెస్టారెంట్ కట్టకూడదు. బోరు అక్రమంగా వేసి నీటిని వాడుతున్నారు. వ్యర్థ జలాలు కాలువలోకి వదిలేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఓ ప్రజా ప్రతినిధి అండగా ఉండడంతో అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించిన తీరం బీచ్

నేరెళ్లవలస సర్వే నంబరు 12/1డి, 1ఈలలో 23 సెంట్ల జిరాయితీ భూమిలో తీరం రెస్టారెంట్ పెట్టారు. 135 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించినట్టు అధికారులు తేల్చారు. స్విమ్మింగ్ పూల్స్ నిర్మించారు. ఏసీసీ షీట్లతో నిర్మాణం ఉంది. ఇది సీఆర్‌జెడ్ నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఉంది. ఏపీసీజెడ్ఎంఏ నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేదు. వీరు కూడా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు.

వైసీపీ నేతల అడ్డా శాంక్టమ్ బీచ్

కాపులుప్పాడ సర్వే నంబర్ 412లో 2.11 ఎకరాల్లో ఏపీటీడీసీ తొట్లకొండకు ఎదురుగా బీచ్‌లో బే వాచ్ పేరుతో రెస్టారెంట్ నిర్మించింది. అందులో ప్రస్తుం ప్రభుత్వ భూమి 46 సెంట్లు ఉన్నట్టు తేల్చారు. దానిని మూర్తి అనే వ్యక్తికి ఏపీటీడీసీ 2017లో పదేళ్లకు లీజుకు ఇచ్చింది. దానిని ముగ్గురు వైసీపీ నేతలు తీసుకుని పేరు 'శాంక్టమ్'గా మార్చి నిర్వహిస్తున్నారు. అదనపు నిర్మాణాలకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకోలేదు. దీనిపై అధికారులు నివేదిక సమర్పించడానికి 24 గంటల ముందు వారికి నోటీసు ఇచ్చారు. ఇది కూడా నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఉంది. బోర్లు వేసి నీటిని వినియోగిస్తూ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇక్కడ నిర్మాణాలన్నీ సిమెంట్ ఇటుకలతో కట్టారు.

ఆక్రమిత స్థలంలో మేర్లిన్ కే బీచ్

భీమిలి మండలం నేరేళ్లవలస సర్వే నంబరు 126లో ఏపీటీడీసీ మేర్లిన్ కే బీచ్ పేరుతో నిర్మాణం చేపట్టింది. లీజుకు ఇచ్చేసి తన పని అయిపోయిందని చేతులు దులుపుకుంది. ప్రస్తుతం అందులో 65 సెంట్లు ఆక్రమిత భూమి ఉన్నట్టు తేలింది. నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. వీరు కూడా అక్రమంగా బోరు వేసి, వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనికి కూడా నివేదిక సమర్పించడానికి ఒకరోజు ముందు జీవీఎంసీ నోటీసులు ఇచ్చింది.

బడ్జెట్‌పై మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

సభ్యుల బలం ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు. ముందుజాగ్రత్తగా 28 మంది కార్పొరేటర్లను సోమవారం బెంగళూరు తరలించారు. మరో ముగ్గురు కార్పొరేటర్లు వివిధ కారణాలతో క్యాంపునకు రాలేకపోయినా, వారంతా పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటారని ఆశతో ఉన్నారు. ఈనెల 29న జరిగే బడ్జెట్ సమావేశానికి వారందరినీ తిరిగి నగరానికి తీసుకువస్తే, కూటమి నేతలు వారిని తమవైపు లాగేసుకునే అవకాశం ఉందనే భయంతో అవిశ్వాస తీర్మానం జరిగిన రోజునే వారిని నగరానికి తీసుకురావాలని భావిస్తున్నారు. అదే జరిగితే 29న జరిగే బడ్జెట్ సమావేశానికి మేయర్ హాజరు అనుమానమే. మేయర్ లేకుండా బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

కోరం ఉంటే...

బడ్జెట్ సమావేశం ఎట్టిపరిస్థితులోనూ ఈ నెలాఖరులోగా నిర్వహించక తప్పని పరిస్థితి కావడంతో మేయర్ లేకపోతే ఏం చేయాలనే దానిపై అధికారులు ఆలోచనలో పడ్డారు. మునిసిపల్ చట్టంలో ఏదైనా ఒక సమావేశానికి మేయర్ హాజరు కానిపక్షంలో డిప్యూటీ మేయర్లతో సమావేశాన్ని నిర్వహించుకునే అవకాశం ఉంది. కానీ జీవీఎంసీలో ఇద్దరు డిప్యూటీ మేయర్లు కూడా వైసీపీకి చెందినవారే కావడంతో మేయర్ రానిపక్షంలో వారిద్దరూ కూడా గైర్హాజరవ్వడం ఖాయం. అలాంటప్పుడు ఏం చేయాలనే దానిపై అధికారులు మునిసిపల్ చట్టంపై అవగాహన ఉన్న సీనియర్ అధికారులతో చర్చిస్తున్నట్టు తెలిసింది.

ఏదైనా ఒక సమావేశం నిర్వహించాలని ముందుగానే అజెండా విడుదల చేస్తే, ఆ సమావేశాన్ని అనుకున్నరోజు ఏర్పాటుచేయాల్సిందేనని చట్టంలో ఉన్నట్టు చెబుతున్నారు. సభ్యుల్లో 1/4 వంతు హాజరైతే సరిపడినంత కోరం ఉన్నట్టుగానే భావించి సమావేశాన్ని ప్రారంభించే వెసులుబాటు ఉందని నిపుణులు చెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. సమావేశానికి హాజరైన సభ్యులంతా కలిసి తమలో ఒకరిని ఆ రోజుకు మేయర్ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎన్నుకుంటే వారు ఆ స్థానంలో కూర్చొని సమావేశాన్ని పూర్తిచేయవచ్చునంటున్నారు. దీనికి అవకాశం ఉంటే బడ్జెట్ సమావేశం సజావుగానే జరిగిపోతుందని, లేనిపక్షంలో ఏప్రిల్ ఒకటి తరువాత జీవీఎంసీ నిర్వహణ ఎలా జరుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

మరో 4 వారాలు గడువివ్వండి

... 5వ పేజీ తరువాయి

ఐదు రెస్టారెంట్లపై కూడా నివేదిక సమర్పించారు. బీ జాగ్ (సీహార్స్) రెస్టారెంట్, తీరం బీచ్ రెస్టారెంట్, మేర్లిన్ క్లే రెస్టో బార్, శాంక్టమ్ బీచ్ రిసార్ట్స్ (తొట్లకొండ), విరాగో రెస్టో బార్..అన్నీ కోస్తా నియంత్రణ మండలిలోని నాన్ డెవలప్‌మెంట్ జోన్‌లో నిర్మించారని పేర్కొన్నారు. ఈ సంస్థలు స్థానికంగా జీవీఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు తీసుకోలేదని స్పష్టంచేశారు. ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ వీటికి ఎన్‌ఓసీ ఇవ్వడానికి నిరాకరించిందన్నారు. నీటి కోసం భూమిలో బోర్లు వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేశారని వెల్లడించారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండానే సముద్రంలోకి విడిచిపెడుతున్నారని, అవి కలుషిత జలాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నిర్ధారించిందని వివరించారు. ఈ ఐదింటిలో రెండు సంస్థలు హైకోర్టు నుంచే స్టే ఆర్డర్ తీసుకున్నాయని, అందుకని వాటిపై చర్యలు తీసుకోలేకపోయామని పేర్కొన్నారు. ఇంకో రెండు సంస్థలు ఏపీటీడీసీ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఇదిలావుండగా భీమిలి బీచ్‌లో కోస్తా నియంత్రణ మండలి నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారంటూ హైకోర్టు నియమించిన కమిటీ కూడా మంగళవారం తన నివేదికను సమర్పించింది.

రైల్వే జోన్ పనులను అడ్డుకున్న గిరిజనులు

... 5వ పేజీ తరువాయి

రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు బదలాయించింది. ఆ స్థలంలో బూని భుయాన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిబ్బంది మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో స్థలం చదునుచేసే పనులు ప్రారంభించారు. అయితే స్థానికంగా నివాసముంటున్న గిరిజనులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు.

అక్కడ సుమారు 66 ఎకరాలను 1963లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 66 గిరిజన కుటుంబాలకు కేటాయించిందని, శ్రీకృష్ణాపురంలో ఇళ్లు కూడా నిర్మించిందని వివరించారు. తమ భూముల్లో పనులు చేపట్టవద్దంటూ నినాదాలు చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఏమైనా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదించాలని కాంట్రాక్టు సిబ్బంది వారికి సూచించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పనులు యథావిధిగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పైడిరాజుతో పాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వైద్యుల కక్కుర్తి

... 5వ పేజీ తరువాయి

తరలించుకుపోతున్నారు. ఇది బహిరంగ రహస్యమే. ఒకసారి కేజీహెచ్‌కు వస్తే రెండోసారి నుంచి క్లినిక్, సదరు వైద్యుడు పనిచేసే ఆస్పత్రికి వెళ్లే రోగులు ఎంతోమంది ఉన్నారు. కేజీహెచ్‌లో వైద్యం పొందాలంటే కనీసం మూడు, నాలుగుసార్లు రావాలన్న భావన రోగుల్లో ఉంది. దీనికంటే నేరుగా సదరు వైద్యుడి క్లినిక్‌కు వెళ్లి చూపించుకుంటే సరిపోతుందన్న పరిస్థితిని సృష్టిస్తున్నారు. ఇది ఆస్పత్రిలోని ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోరు. ఇప్ప టికీ ఎంతోమంది వైద్యులు ఓపీల్లో అందుబాటులో ఉండరు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నామని, మరో ఉన్నతాధికారి వద్దకు వెళ్లామన్న సమాధానం చెబుతుంటారు. ఆస్పత్రిలో వ్యవహా రాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సి ఉంది.

స్టార్టప్ పాలసీతో వినూత్న మార్పులు

... 5వ పేజీ తరువాయి

స్టార్టప్ చేస్తే ఆ ఆలోచనకే రూ.2 లక్షలు గ్రాంటు ఇస్తారు.

- స్టార్టప్ ఉత్పత్తి ప్రారంభిస్తే రూ.15 లక్షల గ్రాంటు
- స్టార్టప్‌లో 30 మంది ఉద్యోగుల వరకూ ఉచిత సీట్లు. ప్లగ్ అండ్ ప్లే. ఎటువంటి అద్దె వసూలు చేయరు.
- ఐడియా బాగా పనిచేస్తుందని నమ్మితే సీడ్ ఫండింగ్‌గా రూ.50 లక్షలు ఈక్విటీ షేరింగ్‌తో ఇస్తారు.
- ఏమైనా ఈవెంట్లకు హాజరైతే ఖర్చులో 75 శాతం రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు.
- మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, దివ్యాంగులకు రూ.20 లక్షల వరకు గ్రాంటు

సిలికాన్ వేలీగా ఏపీ

శ్రీధర్ కొసరాజు, పూర్వ చైర్మన్, ఐటాప్

ఈ కొత్త పాలసీతో ఆంధ్రప్రదేశ్ సిలికాన్ వేలీగా మారనుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారా 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటు చేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ పాలసీలో ప్రభుత్వ ప్రమేయం తక్కువ. దీని ద్వారా ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఐటీ ఎకో సిస్టమ్ పూర్తిగా మారిపోతుంది. కేవలం ఐటీ ఒక్కటే కాకుండా ఐఓటీ, ఏఐ తదితర కొత్త టెక్నాలజీలన్నీ అందుబాటులోకి వస్తాయి. ఇది పూర్తిగా సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్‌ల చొరవతోనే సాధ్యమైంది.

లోవోల్టేజీ సమస్యతో సతమతం

- విద్యుత్ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడమే కారణం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ప్రజలు


అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు

అగనంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లో వోల్టేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. వినియోగదారుల నుంచి నెలనెలా విద్యుత్ చార్జీలను వసూలు చేస్తున్నప్పటికీ తమకు మెరుగైన సేవలు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేయడకపోవంతో లో వోల్టేజీ సమస్య తమను వేధిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

ఏపీఈపీడీసీఎల్ స్థానిక సెక్షన్ కార్యాలయ పరిధి అగనంపూడి పరిసర ప్రాంతాల్లో సుమారు 18 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో గల్లవానిపాలెం, శనివాడ, శ్రీనివాస్‌నగర్, శాంతినగర్, తలారివానిపాలెం ఏరియాల్లో బహుళ అంతస్థులు ఎక్కువగా ఉన్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో కొండయ్యవలస, అండమాన్ కొండయ్యవలస, డొంకాడ, పినమడక, దిబ్బపాలెం ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య అధికంగా ఉంది. లో వోల్టేజీ కారణంగా ఎలక్ట్రానిక్ సంబంధిత గృహోపకణాలు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవి వేడిమి ప్రారంభమవ్వడంతో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం బాగా పెరిగింది. అయితే లో వోల్టేజీ సమస్య వల్ల పలు ప్రాంతాల్లో ఫ్యాన్లు తిరగడమే గగనంగా మారడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. విద్యుత్ మోటార్లు సైతం పనిచేయక పోవడంతో నీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. ఈ విషయం ఈసీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకునైనా లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా కొత్తగా ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఈపీడీసీఎల్ ఏఈ జయంత్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా... అగనంపూడి ప్రాంతంలో కొత్తగా ఆరుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ట్రాన్స్‌పార్మర్లు మంజూరైన వెంటనే ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి
-బలిరెడ్డి నాగేశ్వరరావు, అగనంపూడి



అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో లో వోల్టేజీ సమస్యలు తలెత్తకుండా తక్షణమే విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేయాలి. విద్యుత్ కనెక్షన్లకు తగినన్ని ట్రాన్స్‌పార్మర్లు లేనందునే లో వోల్టేజీ సమస్య వేధిస్తుంది. ఈ కారణంగా ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, విద్యుత్ మోటార్లు పనిచేయడం లేదు. వేసవి వేడి తీవ్రత పెరుగుతున్న కారణంగా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు త్వరితగతిన తగిన చర్యలు చేపట్టాలి.

ఆధ్యాత్మిక శోభ

పలుచోట్ల వైభవంగా శ్రీవారి కల్యాణాలు, అమ్మవారి జాతరలు

పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు


గ్రీన్ సిటీ ఆలయంలోని ప్రత్యేక వేదికపై ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి


నాయుడుతోట రవినగర్‌లోని శేషాద్రి కొండపై పూజలందుకున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

కూర్మన్నపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి, శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణాన్ని పురస్కరించుకు మంగళవారం పలు ప్రాంతాల్లో ఆధ్యాతికమ శోభ సంతరించుకుంది. శ్రీవారి కల్యాణాలతో పాటు పలుచోట్ల జరిగిన అమ్మవార్ల జాతర్లలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీలో శ్రీలక్ష్మీ ఆండాళ్ సమేత వైభవ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు వాసుస్వామి, చక్రపాణి స్వామిలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, పద్మజ, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి, వెలగ వెంకటరావు, సుబ్రహ్మణ్యం, సునీల్, గణేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్ ప్రాంగణంలో..

అక్కిరెడ్డిపాలెం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి శాంతి కల్యాణం ఘనంగా జరిపారు. ఉదయం వేంకటేశ్వరస్వామిని వేదపండితులు పంచామృతాలతో అభిషేకించి పలు రకాల పుష్పాలు, నగలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేసి హైందవ సంప్రదాయ పద్ధతిలో శ్రీవారి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దివ్య క్షేత్రం పాలక మండలి సభ్యులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రవినగర్ శేషాద్రి కొండపై..

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రభాతారాధనలు జరిపాక శ్రీవారికి పంచామృతాభిషేకం, పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. మధురవాడకు చెందిన అన్నదాతలు జగదీశ్, లక్ష్మీకాంతం కుటుంబ సభ్యులకు ఈవో బండారు ప్రసాద్, అర్చకులు శ్రీనివాసస్వామి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.


శీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


85వ వార్డులో పూజలు అందుకున్న బోయమాంబ


చినముషిడివాడలో పరదేశిమాంబ..

బోయమాంబ అనుపోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక, కొత్తూరు, పూడివానిపాలెం, కర్రివానిపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బోయమాంబ అమ్మవారి జాతర మంగళవారంతో వైభవంగా జరిగింది. అనుపోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక మళ్లీ ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. బాణసంచా కాల్పులతో పాటు రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చినముషిడివాడలో పరదేశిమాంబ పండగ

పెందుర్తి: చినముషిడివాడ ప్రజల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పసుపుకుంకుమలు, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పరదేశిమాంబకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఘటాలను సాముగారిడీలు, చిడతలు, పులివేషాలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్ర ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వేపగుంట రైతులకు న్యాయం చేయాలి

వీఎంఆర్డీఏ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేపగుంటలోని నాలుగు దశాబ్దాలుగా రైతులకు, వుడాకు మధ్య న్యాయస్థాన వివాదంలో ఉన్న 144 ఎకరాల భూముల సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో కమిషనర్ విశ్వనాథన్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అప్పట్లో వుడా సేకరించిన భూములకు సంబంధించి నెలకొన్న వివాదాన్ని కమిషనర్‌కు వివరించారు. దీనివల్ల వాస్తవ హక్కుదారులైన రైతులు భూ క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో వారు ఏళ్లతరబడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారం రోజుల్లో వుడా (వీఎంఆర్డీఏ) ఆధీనంలో గల భూములను రైతుల అంగీకారంతో సర్వే చేపట్టి శాఖాపరమైన విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పంచకర్ల తెలిపారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సుజాతనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తొమ్మిది మంది అనారోగ్య బాధితులకు రూ.14,92,556 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అందజేశారు.

అభివృద్ధిని కాంక్షించే కార్పొరేటర్ల చేరిక

ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్


హరిప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోన తాతారావు, కనకారావు, తదితరులు

కూర్మన్నపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మే విశాఖకు చెందిన కార్పొరేటర్లు జనసేన, టీడీపీల్లో చేరుతున్నారనీ జనసేన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, కరణం కనకారావులు, కార్పొరేటర్ బొండా జగన్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్పొరేటర్లపై ఎలాంటి ఒత్తిడి తేవాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్ష నాయకులు చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కాద శ్రీను, గంధం వెంకటరావు, సిరసపల్లి కనకరాజు, నరసింగరావు, లంకల మురళీదేవి, సూరిబాబు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో ఉక్కు కాంట్రాక్టు కార్మిక నాయకుల సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై బుధవారం రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య కీలక సమావేశం జరగనున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సమావేశం అత్యంత కీలకంగా మారింది. స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల ఏడున కాంట్రాక్టు కార్మికుల సమ్మె చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకుల సమావేశమై సమ్మెను వాయిదా వేశారు. అనంతరం 11న ఆర్ఎల్‌సీ సమక్షంలో సమావేశం జరిగినప్పటికీ అసంపూర్ణంగా చర్చలు జరగడంతో బుధవారానికి వాయిదా పడింది. 28న ప్లాంటులో సమ్మె చేస్తామని కార్మిక నాయకులు ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో కార్మికులకు అనుకూలంగా యాజమాన్యం నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు కోరుతున్నారు.

ఆస్తి పన్ను వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

వేపగుంట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో ఇళ్ల, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపు, పాతబకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్సీ కె.హైమావతి ఒక ప్రకటనలో కోరారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. గతంలో చెల్లింపులు చేసిన వారికి సైతం ఈ వడ్డీ రాయితీ తదుపరి బిల్లు చెల్లింపులో మినహాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి చేసిన నిందితులను శిక్షించాలి

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ డెలివరీ చేసిన యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ దక్షిణ భారత చైర్మన్ సన్నీ కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో జరిగిన ఈ సంఘటన విచారకరమని, యువకుడిపై విచక్షణరహితంగా దాడి చేయడం హేయమన్నారు. అతడు తప్పు చేశాడని భావిస్తే, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప, దాడులు చేయడం దారుణమని, ఇలాంటివి మళ్లీ జరగకుండా నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు పరం చేయవద్దని ఆందోళన

మల్కాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆస్పత్రిని ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ మల్కాపురంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోర్టు డాక్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాథరావు మాట్లాడుతూ పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అన్ని యూనియన్లతో కలిసి త్వరలో ఆ ఆస్పత్రి వద్దే ఆందోళన చేపడతామన్నారు. పోర్టు యజమాన్యం పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పేరుతో 2024 సెప్టెంబర్ 24న టెండర్లు పిలవగా.. అప్పుడు సీఐటీయూ అన్ని యూనియన్లతో కలిసి దీక్షకు దిగడంతో ప్రైవేటీకరణకు బ్రేక్ పడిందన్నారు. ఏప్రిల్ 21న నాటి టెండర్లను ఓపెన్ చేయడానికి పోర్టు యాజమాన్యం యత్నిస్తుండడం దారుణమన్నారు. వచ్చే నెల 9న పోర్టు భవనం వద్ద చేపట్టనున్న ఆందోళనను అందరూ విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కె.పెంటారావు, లక్ష్మణమూర్తి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.


మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద లీకేజీ

పైపు లైన్‌కు లీకేజీ

వృథాగా పోతున్న తాగునీరు
అధికారులు పట్టించుకోరు!

మల్కాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం మరిడిమాంబ ఆలయం ఎదురుగా ఉన్న జీవీఎంసీ తాగునీటి పైపు లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతుంది. ప్రధాన గెడ్డపై ఉన్న ఈ పైపు లైన్ ద్వారానే అనేక కాలనీలకు, కోస్టుగార్డు క్వార్టర్స్‌కు, నౌసేనాబాగ్‌కు, కేంద్రీయ విద్యాలయం, తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడి రోజులు గడుస్తున్నా పట్టించుకునే నాథులే లేకపోవడంతో తాగునీరు వృథాగా పారుతూ కాలువలో కలుస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పైపు లైన్‌కు మరమ్మతులు చేసేందుకు సోమవారం సిబ్బంది గోతిని తవ్వి వదిలేశారే తప్పా ఎలాంటి పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయ విజ్ఞానంపై అవగాహన

అగనంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞానంపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గాజువాక కోర్టు మేజిస్ట్రేట్ ఎ.కృష్ణప్రసాద్ న్యాయ విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన కల్పించారు. న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామకృష్ణ, త్రివేణి, ఎస్ఐ శ్రీనివాస్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలపై..

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో కేంబ్రిడ్జ్ భాషా నైపుణ్యాల సర్టిఫికేషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ట్రైనర్లు రోజాలియా, విజయబాబులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచీకరణ యుగంలో భాషా నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. కేంబ్రిడ్జ్ భాషా నైపుణ్యాల సర్టిఫికేషన్ పొందడం వల్ల ప్రయోజనాలను వివరించారు. అనంతరం వారిని విజ్ఞాన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

27లోగా పాలసీలు చెల్లించాలి

అగనంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కోసం కల్పిస్తున్న గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీ (జీఎంఐపీ), పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్ఎంఎస్) ప్రీమియంను ఈ నెల 27లోగా ఆన్‌లైన్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు గుదే సుశీలగజేంద్రరావు, ఎస్ఎం రఫీలు తెలిపారు. గడువు తేదీలోగా ప్రీమియం చెల్లించకపోతే వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆరోగ్య బీమాను కోల్పోతారని పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 38, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, మునక్కాడలు (కిలో) 28, నిమ్మకాయలు (కిలో) 110, బద్ధచిక్కుడు 52, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196


విమానాశ్రయంలోకి వెళ్తున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు సభ్యులు

హైదరాబాద్ పయనమైన లఖ్‌నవూ జట్టు

గోపాలపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు సభ్యులు తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న టీమ్ సభ్యులు హైదరాబాద్ వెళ్లారు. క్రికెట్ అభిమానులు వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఉక్కు పరిరక్షణకు సీఎం చంద్రబాబు కృషి

టీఎన్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి


టీఎన్‌టీయూసీ నాయకులను సత్కరించిన దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని టీఎన్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అన్నారు. యూనియన్ కోసం సేవలందిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, ప్లాంట్ కోశాధికారి పొట్ల శ్రీనులను మంగళవారం కర్మాగారంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం పోరాడే నాయకులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్లాంట్‌లోని సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కలిసి విన్నవించామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుమ్మడి నరేంద్రకుమార్, నాయకులు శ్రీనివాస్, కొల్లి శివనాగేశ్వరరావు, జగదీశ్, రఘుప్రసాద్, కిరణ్, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్లాంటులో ఉద్యోగం చేస్తూ వీఆర్ఎస్ తీసుకున్న అధికారులకు 'సీ' ఆధ్వర్యంలో పలు విభాగాల్లో సత్కరించారు. ఈ సందర్భంగా 'సీ' అధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్‌లు ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ముస్లింల సంక్షేమానికి కృషి: 'పల్లా'

అగనంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి మసీద్‌లో ఇబ్రహీం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామర్యానికి ప్రతీకగా నిలిచే పండగలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు షేక్ రెహమాన్, స్థానిక నాయకులు కర్రి దేవేంద్ర, ఇల్లపు ప్రసాద్, వాసు, డి.రమేశ్, నూర్‌బాషా, షేక్ బాబ్జీ, ఇస్మాయిల్ అబ్దుల్లా, షంసుద్దీన్, పీటీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గోపాలపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం-రైతుల అవసరాలు అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో గోపాలపట్నం మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడే ఇటువంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్ సూచించారు.

అదానీ గంగవరం పోర్టుకు 'సీఐఐ' అవార్డు

గాజువాక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టుకు సీఐఐ సదరన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ లీడర్‌షిప్ అవార్డు లభించింది. సోమవారం రాత్రి నగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఎం.ప్రతాప్ చేతుల మీదుగా పోర్టు ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది సంస్థ ఉద్యోగుల సమష్టి కృషి ఫలితమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వారు పేర్కొన్నారు.

కిశోర బాలికల సంరక్షణకు చర్యలు చేపట్టాలి


గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్

పెదగంట్యాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్ అన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం గంగవరం ఉన్నత పాఠశాలలో జరిగిన కిశోర బాలికల సంరక్షణ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 11 నుంచి 18 ఏళ్ల వయసు గల బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారిలో అవగాహన లోపం, తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపమే అందుకు కారణమన్నారు. వారిని భద్రంగా కాపాడుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉందన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికలు అనేక మానసిక, శారీరక సమస్యల బారినపడుతున్నారని పేర్కొన్నారు. అమ్మాయిలకు 20 ఏళ్లు దాటాక వివాహం చేయడమే శ్రేయస్కరమన్నారు. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డి.నీలవేణి మాట్లాడుతూ బాలికలను చదివించి వారిలో మానసిక పరిపక్వత వచ్చాక వివాహం చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గమ్మ, శాంతి, దేవుడమ్మ, మహిళా పోలీసులు అరుణ, శిరీష, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

పెందుర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానంలో సరళీకృత మార్పు కోసం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నాయని శిశు సంక్షేమశాఖ పీడీ జయదేవి పేర్కొన్నారు. అభ్యసన కేంద్రాలుగా అంగన్‌వాడీ సెంటర్లను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పెందుర్తిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ బి పడాయి అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మంగళవారం ఆమె హాజరై మాట్లాడారు. పీడీ నీలవేణి, శిక్షకులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాలక్ష్మి, మానస, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తో ముడిపడిన దేశ ప్రగతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తలశిల బలరామకృష్ణ

శ్రీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్ర ప్రగతి సైన్స్‌తోనే ముడిపడి ఉంటుందని, లైఫ్ సైన్స్‌తో చేకూరే బహుళ ప్రయోజనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీఎస్సార్ టీబీకే కాలేజీ చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. శ్రీనగర్‌లోని టీఎస్సార్ టీబీకే కాలేజీలో మంగళవారం జరిగిన లైఫ్ సైన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూమిపై ఉన్న వివిధ రకాల జంతు జాతులు, నాలుగు లక్షల జాతుల మొక్కలు, మిలియన్ల కీటకాలు, అనంతమైన వైరస్‌లపై అధ్యయనం చేసి, పరిశోధనల్లోని కీలక అంశాలు మన దేశ ప్రగతికి ఎలా దోహదపడతాయో శాస్త్రవేత్తలు వివరిస్తారన్నారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావులు మాట్లాడుతూ విద్యార్థులు, కృషి, శ్రమించే గుణాలను అలవర్చుకుంటే అద్భుతాలను సృష్టిస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుభాషిణి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రమణకుమారి

మద్రిపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం, చినగదిలి, ములగాడ మండలాల్లో ఉన్న సుమారు 150 మంది అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ రమణకుమారి తెలిపారు. కార్యకర్తల్లో నైపుణ్యం పెంపునకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు నవచేతన, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ శిల అని నామకరణం చేస్తూ బెంగళూరు కేంద్రంగా దేశవ్యాప్తంగా సీడీపీఓ, సూపర్‌వైజర్లకు రీజనల్ ఏజెన్సీ ద్వారా ఇప్పటికే ఐసీడీఎస్ సిబ్బంది శిక్షణ పొందారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు వారు ఇప్పుడు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోషణ స్థాయి పెంచడం, చిన్నారులలో విద్యను మెరుగుపరచడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని రమణకుమారి తెలిపారు.

'మేయర్ పదవిని యాదవులకే కేటాయించాలి'



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘ నాయకులు

సీతంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): యాదవులను ఓటు బ్యాంక్‌గాపరిగణించకుండా మేయర్ పదవి ఇవ్వాలని జిల్లా యాదవ సంఘం నాయకులు ఒమ్మి కనకరాజు యాదవ్, పిన్నింటి ఆదిమూర్తి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నగర పాలక సంస్థలో యాదవ సామాజిక వర్గం పాత్రపై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యాదవులకు సముచిత స్థానం కల్పిస్తారనే నమ్మకం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు యాదవులు విశేష కృషి చేశారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న యాదవ సామాజిక వర్గానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు కేటాయించాలని కోరారు. జీవీఎంసీలో 22 మంది యాదవులు కార్పొరేటర్లుగా ఉన్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం యాదవ మహిళలకు మేయర్ పదవి కేటాయించి సముచిత స్థానం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. నక్కపద్మ, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, యడ్ల వేణుగోపాల కృష్ణ, సుమన్, ఒమ్మి ఆనంద్, అల్లు రమణారావు, ఈశ్వరరావు తదితరులు యాదవులకు సంఘీభావం తెలుపుతూ నినదించారు.

శారదాపీఠం అక్రమాలపై 'సిట్' వేయాలి: బి.వి.రామ్

డాబాగార్డెన్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శారదాపీఠం అక్రమాలపై సిట్ వేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు.మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. శారదాపీఠంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని కోరారు. సమావేశంలో బోడేపూడి దొరబాబు, ఎం.శ్యామ్‌ప్రసాద్, కిషోర్‌కుమార్, సురేష్, అప్పారావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

సభ్యుల బలం ఉందని వైసీపీ నేతలు చెబుతున్నారు. ముందుజాగ్రత్తగా 28 మంది కార్పొరేటర్లను సోమవారం బెంగళూరు తరలించారు. మరో ముగ్గురు కార్పొరేటర్లు వివిధ కారణాలతో క్యాంపునకు రాలేకపోయినా, వారంతా పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉంటారని ఆశతో ఉన్నారు. ఈనెల 29న జరిగే బడ్జెట్ సమావేశానికి వారందరినీ తిరిగి నగరానికి తీసుకువస్తే, కూటమి నేతలు వారిని తమ వైపు లాగేసుకునే అవకాశం ఉందనే భయంతో అవిశ్వాస తీర్మానం జరిగిన రోజునే వారిని నగరానికి తీసుకురావాలని భావిస్తున్నారు. అదే జరిగితే 29న జరిగే బడ్జెట్ సమావేశానికి మేయర్ హాజరు అనుమానమే. మేయర్ లేకుండా బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

కోరం ఉంటే...

బడ్జెట్ సమావేశం ఎట్టిపరిస్థితులోనూ ఈ నెలాఖరులోగా నిర్వహించక తప్పని పరిస్థితి కావడంతో మేయర్ లేకపోతే ఏం చేయాలనే దానిపై అధికారులు ఆలోచనలో పడ్డారు. మునిసిపల్ చట్టంలో ఏదైనా ఒక సమావేశానికి మేయర్ హాజరు కానిపక్షంలో డిప్యూటీ మేయర్లతో సమావేశాన్ని నిర్వహించుకునే అవకాశం ఉంది. కానీ జీవీఎంసీలో ఇద్దరు డిప్యూటీ మేయర్లు కూడా వైసీపీకి చెందినవారే కావడంతో మేయర్ రానిపక్షంలో వారిద్దరూ కూడా గైర్హాజరవ్వడం ఖాయం. అలాంటప్పుడు ఏం చేయాలనే దానిపై అధికారులు మునిసిపల్ చట్టంపై అవగాహన ఉన్న సీనియర్ అధికారులతో చర్చిస్తున్నట్టు తెలిసింది. ఏదైనా ఒక సమావేశం నిర్వహించాలని ముందుగానే అజెండా విడుదల చేస్తే, ఆ సమావేశాన్ని అనుకున్నరోజు ఏర్పాటుచేయాల్సిందేనని చట్టంలో ఉన్నట్టు చెబుతున్నారు. సభ్యుల్లో 1/4 వంతు హాజరైతే సరిపడినంత కోరం ఉన్నట్టుగానే భావించి సమావేశాన్ని ప్రారంభించే వెసులుబాటు ఉందని నిపుణులు చెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. సమావేశానికి హాజరైన సభ్యులంతా కలిసి తమలో ఒకరిని ఆ రోజుకు మేయర్ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఎన్నుకుంటే వారు ఆ స్థానంలో కూర్చొని సమావేశాన్ని పూర్తిచేయవచ్చునంటున్నారు. దీనికి అవకాశం ఉంటే బడ్జెట్ సమావేశం సజావుగానే జరిగిపోతుందని, లేనిపక్షంలో ఏప్రిల్ ఒకటి తరువాత జీవీఎంసీ నిర్వహణ ఎలా జరుగుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

కలెక్టరేట్‌లో దాహం..దాహం

» పనిచేయని సూర్య సుజలధార వాటర్ ప్లాంట్

» తాగునీరు లేక సందర్శకులకు ఇబ్బందులు





కలెక్టరేట్‌లో పనిచేయని సూర్య వాటర్ ప్లాంట్,

మహారాణిపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ జిల్లా పాలనాధికారి కార్యాలయం(కలెక్టరేట్)లోనే సందర్శకులకు తాగునీటి కొరత ఏర్పడింది. కలెక్టరేట్‌లో సందర్శకుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సుజలధార పథకం కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. ఈ సమస్యను పట్టించుకునేవారే కరవయ్యారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో గుక్కెడు నీరందక సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సహా వివిధ విభాగాలకు సందర్శకులు నిత్యం వస్తుంటారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో 2017లో 'సనా సూర్య సుజలధార' పేరుతో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిద్వారా స్వచ్ఛమైన తాగునీరు లభించేది. సమీపంలో ఉన్న ఆసుపత్రులు, షాపులకు వచ్చేవారు, అక్కడ పని చేసేవారు సైతం బయట కొనుగోలు చేసే నీళ్ల సీసా కన్నా ఈ నీరు మంచిదని భావించి ఇక్కడకు వచ్చి దాహార్తి తీర్చుకునేవారు. నాలుగైదు నెలలుగా ఈ సుజలధార ప్లాంట్ పనిచేయడం లేదు. అప్పటి నుంచి దీని మరమ్మతుల విషయమై ఎవరూ పట్టించుకోలేదు. కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులు తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. గతంలో రెండు రూపాయలకే నీళ్ల ప్యాకెట్ లభించేది. ఇప్పుడు ఇరవై రూపాయలు పెట్టి సీసా కొనుగోలు చేయవలసి వస్తుంది. అసలే ఎండాకాలం మండిపోతోంది. ప్రజలకు తాగునీటి అవసరాలు పెరిగాయి. అధికారులు స్పందించి సుజలధార ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి సందర్శకుల దాహార్తి తీర్చాలని కోరుతున్నారు.

ఉద్యోగాలకు కెమికల్ విద్యార్థుల ఎంపిక



నియామకపత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా. కె.వి.రమణ, అధ్యాపకులు

కంచరపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం వడినార్ వద్ద గల ప్రముఖ కంపెనీ నయారా ఎనర్జీ ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులు ఆరుగురు ఎంపికయ్యారు. కరోనా అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో విద్యార్థులు తమ సత్తా చాటారు. కళాశాల్లో ఆఖరి ఏడాది చదువుతున్న పెట్రోకెమికల్ విభాగం నుంచి ఇద్దరు, కెమికల్ విభాగం నుంచి నలుగురు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.4.5 లక్షల వంతున వేతనం చెల్లిస్తారు. ఎంపికైన విద్యార్థులకు మంగళవారం కంపెనీ ప్రతినిధులు అమిత్రజిత్ గుప్తా, హెడ్ హెచ్‌ఆర్, రమణ, శ్రిష్టి శుక్లా, కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ నియామక పత్రాలను అందజేశారు. వీరిని ఆయా విభాగాల అధ్యాపకులు జయప్రకాశ్ రెడ్డి, డా.ప్రశాంత కుమారి, దామోదర్, విజయలక్ష్మి, ట్రైనింగ్ అధికారి కుమార్ తదితరులు అభినందించారు.

తైక్వాండోలో విద్యార్థులకు పతకాలు



పతక విజేతలతో బుల్లయ్య కళాశాల కార్యదర్శి మధుకుమార్ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా గేమ్స్‌లో బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. తెనాలిలో జరిగిన తైక్వాండో టోర్నీలో కె.మౌనిక 67 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. పార్వతీపురంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర శరీర సౌష్టవ పోటీల్లో కె.బాలు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్ గంగాభవాని తదితరులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

'రాయితీ టమాటా విక్రయిస్తే మాకు నష్టం'



నరసింహనగర్ రైతుబజారులో విక్రయిస్తున్న రాయితీ టమాటా

అక్కయ్యపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్ రైతుబజారులో ప్రభుత్వ రాయితీతో టమాటా విక్రయించే తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు, డ్వాక్రా వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కో క్రేట్‌కు రూ. 35 నుంచి రూ.50 వరకు తమ చేతి డబ్బులు అదనంగా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక క్రేట్‌లో 16 కిలోల టమాటా ఉంటుందని, కొన్నింటిలో 15 కిలోలు మాత్రమే ఉంటున్నాయని చెప్పారు. ఖాళీ క్రేట్ బరువు కిలో పోతుందన్నారు. రోజూ ఇలాగే అదనంగా చేతి డబ్బులు చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ టమాటా విక్రయించడం వల్ల తమకు ఒరిగేదేమీ లేదని వాపోయారు. ఒక క్రేట్ టమాటాకు లోడింగ్, రవాణా ఖర్చు కలిపి రూ.21, రైతుబజారులో అన్‌లోడింగ్ చేయడానికి కళాసీకి రూ.5 చెల్లిస్తున్నామని చెబుతున్నారు. అలా ఎన్ని క్రేట్‌లు తీసుకొస్తే అన్నింటికి రూ.26 చొప్పున సొంత డబ్బులు ఇస్తున్నామని వాపోయారు. క్రేట్‌లలో వచ్చే టమాటాలో పాడైనవీ ఉంటున్నాయని, క్రేట్‌కు కిలో టమాటా రద్దు ఉంటుందన్నారు. రద్దు టమాటాను చెత్త డబ్బాలో వేస్తున్నా, వాటికీ డబ్బులు భరించాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు తమ ఇబ్బందులు తెలుసుకుని ప్రభుత్వమే అదనపు ఖర్చు భరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, డ్వాక్రా వ్యాపారులు కోరుతున్నారు.

హైవేలో బాంబు స్క్వాడ్ తనిఖీలు

మురళీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఐపీఎల్ మ్యాచ్ అనంతరం మంగళవారం లఖ్‌నవూ జట్టు క్రికెటర్ల తిరుగు పయనంతో నగరంలోని హైవే రోడ్డులో పోలీసులు, బాంబు స్క్వాడ్ యూనిట్ ప్రత్యేక గస్తీ నిర్వహించారు. క్రికెటర్లు స్టేడియం నుంచి ఎన్‌ఏడీ కొత్తరోడ్డు ఎయిర్‌పోర్ట్ చేరే వరకు అడుగడుగునా బాంబు స్క్వాడ్ యూనిట్ అవాంఛనీయ ఘటనలు జరగకుండా రహదారిని జల్లెడ పట్టింది. హెడ్‌కానిస్టేబుల్ అప్పలరాజు, సిబ్బంది రాజు ఎయిర్ పోర్ట్ సమీప ప్రాంతాలైన ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి ఊర్వశి జంక్షన్, కంచరపాలెం హైవే, తాటిచెట్లపాలెం నుంచి వీఐపీ రోడ్డు కనెక్టింగ్ రహదారి వరకు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాల పరిసరాలు, రహదారి పక్కన కల్వర్టులు, గ్రీన్ బెల్ట్ ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ అనుమానిత ప్రాంతాల్ని పరిశీలించింది. ఐపీఎల్ లఖ్‌నవూ జట్టు క్రికెటర్లతో పాటు, సోమవారం నాటి మ్యాచ్ చూసేందుకు విశాఖ చేరుకున్న రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సహా ఇతర రాజకీయ ప్రముఖులు, క్రీడా ఫ్రాంచైజీల ప్రతినిధులు, అతిథుల భద్రత దృష్ట్యా హైవే నుంచి ఎయిర్ పోర్ట్ వరకు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



ఊర్వశి జంక్షన్ హైవేలో తనిఖీ చేస్తున్న సిబ్బంది

గంగవరం సీఈవోతో డీఆర్ఎం భేటీ



గంగవరం పోర్టు వద్ద అధికారులతో కలిసి పరిశీలిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని గంగవరం పోర్టులో రైల్వే సైడింగ్ పరిస్థితిని డీఆర్ఎం లలిత్ బొహ్రా తనిఖీ చేశారు. మంగళవారం ఆయన గంగవరం పోర్టును సందర్శించి కీలక ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్‌తో సమావేశమై అనేక కీలక అంశాలపై చర్చించారు. రేక్ డిటెక్షన్, సామర్థ్యం పెంపు, మెరుగుదలకు చేపట్టాల్సిన అంశాలతోపాటు వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడంలో పరస్పర సహకారానికి సంబంధించిన విషయాలపై చర్చించారు. ఈ పర్యటనలో డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ తన్మయ్ ముఖోపాధ్యాయ, సీనియర్ డీసీఎం కె.సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, నైపుణ్యాలే కీలకం: రెక్టార్ కిషోర్‌బాబు



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రదర్శన



వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న కిషోర్‌బాబు

డాబాగార్డెన్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, నైపుణ్యాలను అలవర్చుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పైడి డిగ్రీ కళాశాల విద్యార్థుల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిగ్రీ విద్యార్థులు చెడుదారిలో నడవరాదని హితవు పలికారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా రాణించాలన్నారు. కళాశాల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ చక్కని నడవడికతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అభిలషించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా.డి.సరోజ్ మాట్లాడారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్, దేశభక్తి పాటలు అలరించాయి. వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు..

దారంతా చెత్త!



మధురానగర్‌లో రామదూత ఆంజనేయస్వామి గెడ్డ వద్ద దారికి ఇరువైపులా పోగుపడిన చెత్తకుప్పలు

సీతంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు మధురానగర్‌లోని రామదూత ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని గెడ్డ వద్ద పెద్దఎత్తున చెత్త పేరుకుపోయింది. గెడ్డ గోడలకు అనుకుని ఇరువైపులా చెత్త వేయడంతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. చుట్టుపక్కల వీధుల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తారు. చెత్త పేరుకుపోవడంతో దారి కుచించుకుపోయింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినా, నడిచి వెళ్లినా ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట ప్రాంతం నుంచి మధురానగర్ మీదుగా శంకరమఠం వైపు వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద గెడ్డలో చాలా కాలంగా చెత్త గుట్టగా పేరుకుపోయింది. ఆ పరిసర నివాసితులు దుర్గంధం భరించలేకపోతున్నారు. దోమలు వ్యాపించడంతో రాత్రివేళ నిద్రకు ఆటంకం కలుగుతోందని వాపోతున్నారు. తక్షణమే గెడ్డలు శుభ్రం చేయించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైశాఖి స్పోర్ట్సు పార్కులో బాలలకు ఈత పోటీలు

మురళీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ స్విమ్మింగ్ పూల్‌లో డెకాత్లాన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బాలబాలికలకు ఈత పోటీలు నిర్వహించారు. క్రీడాకారుల్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఏటా ఈ కార్యక్రమాల్ని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి మణికుమార్ తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న పలువురు స్విమ్మర్లు విభిన్న వయస్సుల కేటగిరీల్లో ఈ పోటీలో పాల్గొన్నారు. విజేతలకు వైశాఖీ స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, కార్యదర్శి పి.వి.నారాయణరాజు, డెకాత్లాన్ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందించారు.

బీచ్ రెస్టారెంట్ల బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చేపడుతుంటే జీవీఎంసీ పనులు ఆపాలని కోరింది. ఆ తరువాత దానిని మద్దిపాటి శిరీష లీజుకు తీసుకుని జీవీఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారు. అలాగే ఎక్సైజ్ నుంచి లిక్కర్ లైసెన్స్ పొందారు. ఇది సీఆర్‌జెడ్-3లో ఉంది. హోటల్, రెస్టారెంట్ కట్టకూడదు. బోరు అక్రమంగా వేసి నీటిని వాడుతున్నారు. వ్యర్థ జలాలు కాలువలోకి వదిలేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఓ ప్రజా ప్రతినిధి అండగా ఉండడంతో అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించిన తీరం బీచ్

నేరెళ్లవలస సర్వే నంబరు 12/1డి, 1ఈలలో 23 సెంట్ల జిరాయితీ భూమిలో తీరం రెస్టారెంట్ పెట్టారు. 135 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించినట్టు అధికారులు తేల్చారు. స్విమ్మింగ్ పూల్స్ నిర్మించారు. ఏసీసీ షీట్లతో నిర్మాణం ఉంది. ఇది సీఆర్‌జెడ్ నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఉంది. ఏపీసీజెడ్ఎంఏ నుంచి ఎన్‌ఓసీ తీసుకోలేదు. వీరు కూడా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు.

వైసీపీ నేతల అడ్డా శాంక్టమ్ బీచ్

కాపులుప్పాడ సర్వే నంబర్ 412లో 2.11 ఎకరాల్లో ఏపీటీడీసీ తొట్లకొండకు ఎదురుగా బీచ్‌లో బే వాచ్ పేరుతో రెస్టారెంట్ నిర్మించింది. అందులో ప్రస్తుం ప్రభుత్వ భూమి 46 సెంట్లు ఉన్నట్టు తేల్చారు. దానిని మూర్తి అనే వ్యక్తికి ఏపీటీడీసీ 2017లో పదేళ్లకు లీజుకు ఇచ్చింది. దానిని ముగ్గురు వైసీపీ నేతలు తీసుకుని పేరు 'శాంక్టమ్'గా మార్చి నిర్వహిస్తున్నారు. అదనపు నిర్మాణాలకు జీవీఎంసీ నుంచి అనుమతి తీసుకోలేదు. దీనిపై అధికారులు నివేదిక సమర్పించడానికి 24 గంటల ముందు వారికి నోటీసు ఇచ్చారు. ఇది కూడా నో డెవలప్‌మెంట్ జోన్‌లో ఉంది. బోర్లు వేసి నీటిని వినియోగిస్తూ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఇక్కడ నిర్మాణాలన్నీ సిమెంట్ ఇటుకలతో కట్టారు.

ఆక్రమిత స్థలంలో మేర్లిన్ కే బీచ్

భీమిలి మండలం నేరేళ్లవలస సర్వే నంబరు 126లో ఏపీటీడీసీ మేర్లిన్ కే బీచ్ పేరుతో నిర్మాణం చేపట్టింది. లీజుకు ఇచ్చేసి తన పని అయిపోయిందని చేతులు దులుపుకుంది. ప్రస్తుతం అందులో 65 సెంట్లు ఆక్రమిత భూమి ఉన్నట్టు తేలింది. నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. వీరు కూడా అక్రమంగా బోరు వేసి, వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనికి కూడా నివేదిక సమర్పించడానికి ఒకరోజు ముందు జీవీఎంసీ నోటీసులు ఇచ్చింది.

పరిశ్రమల కోసం 1000 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

సమర్పించేందుకు జిల్లాకు సంబంధించి ఆయన ఒక నివేదిక రూపొందించారు. జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేయాలనుకుంటున్నదీ అందులో వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు పెడతామన్నారు. వాటికి ఏయూలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సహకరిస్తుందని, దీనివల్ల 300 స్టార్టప్‌లు, 1,800 మందికి నేరుగా ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. ఐఐఎం ఇంకుబేషన్, స్టార్టప్ హబ్‌లో 300 స్టార్టప్‌లకు సహకారం అందిస్తామన్నారు.

● పీఎం సూర్యఘర్ కింద 7,500 సోలార్ రూఫ్‌టాప్‌లు అమరుస్తున్నామన్నారు. ఆరింటిని మోడల్ సోలార్ గ్రామాలుగా మారుస్తామన్నారు. సుమారు 98 ఎకరాలలో 5 సోలార్ ప్లాంట్లను 9.47 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేస్తామన్నారు. అలాగే మరో 100 ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. సీఎన్‌జీ అమ్మకాలు పెంచడానికి కొత్తగా 5 రిటైల్ అవుట్‌లెట్లు పెడతామన్నారు.

● మెట్రో రైలు మొదటి దశ నిర్మాణానికి అవసరమైన భూమిని ఆరు నెలల్లో అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

● భోగాపురం విమానాశ్రయం ట్రాఫిక్‌ను తట్టుకోవడానికి 15 మాస్టర్ ప్లాన్ రహదారులను 72.82 కి.మీ. పొడవున రూ.392.89 కోట్లతో నిర్మించనున్నామని, వీటిని వచ్చే జూన్ నాటికి పూర్తిచేస్తామన్నారు.

● జీవీఎంసీ పరిధిలో పనిచేసే మహిళల కోసం ఐదు ప్రాంతాల్లో వర్కింగ్ విమెన్ హాస్టళ్లు నిర్మించే ఆలోచన ఉందన్నారు. వీటి ద్వారా 1,150 మందికి ఆశ్రయం లభిస్తుందన్నారు.

● మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థను రూ.643 కోట్లతో చేపట్టనున్నామని వెల్లడించారు.

● పరదేశిపాలెంలో కాలేజీ విద్యార్థినులకు రూ.70 లక్షలతో హాస్టల్ భవనం నిర్మిస్తామన్నారు.

● కేజీహెచ్ ఓపీ బ్లాక్, క్యాజువాలిటీని కోటి రూపాయలతో ఆధునీకరించనున్నట్టు పేర్కొన్నారు.

● త్వరలోనే విశాఖ పోర్టులో క్రూయిజ్ టూరిజం ప్రారంభం కానుందని, బీచ్‌లో హోప్ ఆన్, హోప్ ఆఫ్ బస్సు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు.

స్టార్టప్ పాలసీతో వినూత్న మార్పులు

... 5వ పేజీ తరువాయి

స్టార్టప్ చేస్తే ఆ ఆలోచనకే రూ.2 లక్షలు గ్రాంటు ఇస్తారు.

● స్టార్టప్ ఉత్పత్తి ప్రారంభిస్తే రూ.15 లక్షల గ్రాంటు

● స్టార్టప్‌లో 30 మంది ఉద్యోగుల వరకూ ఉచిత సీట్లు. ప్లగ్ అండ్ ప్లే. ఎటువంటి అద్దె వసూలు చేయరు.

● ఐడియా బాగా పనిచేస్తుందని నమ్మితే సీడ్ ఫండింగ్‌గా రూ.50 లక్షలు ఈక్విటీ షేరింగ్‌తో ఇస్తారు.

● ఏమైనా ఈవెంట్లకు హాజరైతే ఖర్చులో 75 శాతం రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు.

● మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, దివ్యాంగులకు రూ.20 లక్షల వరకు గ్రాంటు

సిలికాన్ వేలీగా ఏపీ

శ్రీధర్ కొసరాజు, పూర్వ చైర్మన్, ఐటాప్

ఈ కొత్త పాలసీతో ఆంధ్రప్రదేశ్ సిలికాన్ వేలీగా మారనుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ ద్వారా 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటు చేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ పాలసీలో ప్రభుత్వ ప్రమేయం తక్కువ. దీని ద్వారా ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఐటీ ఎకో సిస్టమ్ పూర్తిగా మారిపోతుంది. కేవలం ఐటీ ఒక్కటే కాకుండా ఐఓటీ, ఏఐ తదితర కొత్త టెక్నాలజీలన్నీ అందుబాటులోకి వస్తాయి. ఇది పూర్తిగా సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్ల చొరవతోనే సాధ్యమైంది.

మరో 4 వారాలు గడువివ్వండి

... 5వ పేజీ తరువాయి

ఐదు రెస్టారెంట్లపై కూడా నివేదిక సమర్పించారు. బీ జాగ్ (సీహార్స్) రెస్టారెంట్, తీరం బీచ్ రెస్టారెంట్, మేర్లిన్ క్లే రెస్టో బార్, శాంక్టమ్ బీచ్ రిసార్ట్స్ (తొట్లకొండ), విరాగో రెస్టో బార్...అన్నీ కోస్తా నియంత్రణ మండలిలోని నాన్ డెవలప్‌మెంట్ జోన్‌లో నిర్మించారని పేర్కొన్నారు. ఈ సంస్థలు స్థానికంగా జీవీఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు తీసుకోలేదని స్పష్టంచేశారు. ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ వీటికి ఎన్‌ఓసీ ఇవ్వడానికి నిరాకరించిందన్నారు. నీటి కోసం భూమిలో బోర్లు వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేశారని వెల్లడించారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండానే సముద్రంలోకి విడిచిపెడుతున్నారని, అవి కలుషిత జలాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నిర్ధారించిందని వివరించారు. ఈ ఐదింటిలో రెండు సంస్థలు హైకోర్టు నుంచే స్టే ఆర్డర్ తీసుకున్నాయని, అందుకని వాటిపై చర్యలు తీసుకోలేకపోయామని పేర్కొన్నారు. ఇంకో రెండు సంస్థలు ఏపీటీడీసీ పరిధిలో ఉన్నాయని వివరించారు. ఇదిలావుండగా భీమిలి బీచ్‌లో కోస్తా నియంత్రణ మండలి నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారంటూ హైకోర్టు నియమించిన కమిటీ కూడా మంగళవారం తన నివేదికను సమర్పించింది.

రైల్వే జోన్ పనులను అడ్డుకున్న గిరిజనులు

... 5వ పేజీ తరువాయి

రైల్వే జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖకు బదలాయించింది. ఆ స్థలంలో బూసి భయాన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సిబ్బంది మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో స్థలం చదునుచేసే పనులు ప్రారంభించారు. అయితే స్థానికంగా నివాసముంటున్న గిరిజనులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. అక్కడ సుమారు 66 ఎకరాలను 1963లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 66 గిరిజన కుటుంబాలకు కేటాయించిందని, శ్రీకృష్ణాపురంలో ఇళ్లు కూడా నిర్మించిందని వివరించారు. తమ భూముల్లో పనులు చేపట్టవద్దంటూ నినాదాలు చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు. ఏమైనా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదించాలని కాంట్రాక్టు సిబ్బంది వారికి సూచించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పనులు యథావిధిగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకుడు పైడిరాజుతో పాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వైద్యుల కక్కుర్తి

... 5వ పేజీ తరువాయి

తరలించుకుపోతున్నారు. ఇది బహిరంగ రహస్యమే. ఒకసారి కేజీహెచ్‌కు వస్తే రెండోసారి నుంచి క్లినిక్, సదరు వైద్యుడు పనిచేసే ఆస్పత్రికి వెళ్లే రోగులు ఎంతోమంది ఉన్నారు. కేజీహెచ్‌లో వైద్యం పొందాలంటే కనీసం మూడు, నాలుగుసార్లు రావాలన్న భావన రోగుల్లో ఉంది. దీనికంటే నేరుగా సదరు వైద్యుడి క్లినిక్‌కు వెళ్లి చూపించుకుంటే సరిపోతుందన్న పరిస్థితిని సృష్టిస్తున్నారు. ఇది ఆస్పత్రిలోని ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోరు. ఇప్ప టికీ ఎంతోమంది వైద్యులు ఓపీల్లో అందుబాటులో ఉండరు. ఎవరైనా ప్రశ్నిస్తే ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నామని, మరో ఉన్నతాధికారి వద్దకు వెళ్లామన్న సమాధానం చెబుతుంటారు. ఆస్పత్రిలో వ్యవహా రాలపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సి ఉంది.

వైభవంగా నూకాంబిక అమ్మవారి జాతర



పూజలు అందుకుంటున్న నూకాంబిక

ఆరిలోవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పాత డెయిరీ ఫారంలోని వెటర్నరీ కాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి వార్షిక జాతర మంగళవార అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉదయాన్నే అమ్మవారికి అర్చక స్వాములు జల, క్షీర పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఐదు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంకి చివరి రోజు శనివారం అమ్మవారి జాతర కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సంప్రదాయబద్ధంగా సాగరదుర్గ అమ్మవారి పండుగ



పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో సాగరదుర్గ అమ్మవారికి తొలి పండుగ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యింది. ఇటీవల ఈ గ్రామంలో సాగర దుర్గ అమ్మవారికి ఆలయం నిర్మించి ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా అమ్మవారికి తొలి పండుగను భారీ ఊరేగింపులతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. భారీ సంఖ్యలో ఈ ఉత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు, అప్పలరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **డ్రాగన్ :** కామేశ్వరి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 27, బెండకాయలు 30, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 28, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 28, అల్లం (పాతది) 50, బరబాటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	88
లైవ్ ధర	108
విత్ స్కిన్	186
స్కిన్‌లెస్	196

నెలాఖరు వరకే తొలి విడత ఫ్రీ గ్యాస్ సిలిండర్

» తూర్పులో 60 వేలకు పైగా లబ్ధిదారులు



మద్దిలపాలెం, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా గత ఏడాది దీపావళి పండుగ రోజున ఉచిత గ్యాస్ సిలిండర్ల (దీపం-2) పథకాన్ని అమలు చేసింది. నాలుగు నెలలకు ఒక ఫ్రీ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు అందించేలా దీపం-2 పథకం రూపొందించారు. ఇందులో భాగంగా తొలి ఉచిత గ్యాస్ సిలెండర్‌ను గత ఏడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు అవకాశం కల్పించారు. అయితే మార్చి నెల పూర్తి కావడానికి కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయి.ఈలోగా గ్యాస్ సిలిండర్ ఉచితంగా పొందకుంటే లబ్ధిదారులకు ఒక ఫ్రీగ్యాస్ పోయినట్టే. ఏప్రిల్ నుంచి జూలైలోపు ఒకటి, ఆగష్టు నుంచి నవంబరు వరకు ఒకటి అంటే ఇంకా రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు మాత్రమే పొందగలరు. తూర్పు నియోజకవర్గంలో సుమారు 80 వేల తెలుపు కార్డుదారులున్నారు. వారిలో 60వేలకు పైగా దీపం-2 పథకానికి అర్హులుగా తేల్చారు. ఇప్పటికే 90శాతం మంది ఉచిత గ్యాస్ సిలిండర్ పొందినట్టు అధికారులు చెబుతున్నారు. అర్హత ఉండి గ్యాస్ రాయితీ లబ్ధిదారులు వెంటనే గ్యాస్ ఏజెన్సీలో పరిశీలన చేసుకోవాలి.

అర్హత పరిశీలించుకోవాలి..

తెలుపుకార్డు దారులు ముందుగా దీపం-2 పథకానికి అర్హత ఉందో లేదో గ్యాస్ ఏజెన్సీలో పరిశీలించుకోవాలి. రేషన్‌కార్డుకు లింకైన ఆధార్ కార్డు వ్యక్తుల పేరు మీద ఆస్తి పన్ను చెల్లింపులు, ఆదాయపన్ను చెల్లింపులు, 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం, కార్లు రుణాలు వంటివి కలిగిన కార్డు దారులు ఉచిత గ్యాస్ సిలండర్‌కు అనర్హులు. నిబంధనలు లోబడి ఉన్న తెలుపు కార్డుదారులకు ఈకేవైసీ లేకపోయినా గ్యాస్ రాయితీ నగదు జమ కాదు. అలాంటి వారు తమ గ్యాస్ కనెక్షన్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకుని గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలి. ఈకేవైసీ చేసిన రాయితీ నగదు జమకాకపోతే టోల్‌ఫ్రీ నంబర్ 1967లో సంప్రదించాలి.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లు



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం



ఆలయంలోని హనుమత్ సీతారామ లక్ష్మణుల విగ్రహాలు

వెంకోజిపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :శ్రీరామ నవమి ఉత్సవాలకు 15 వార్డు పాత వెంకోజిపాలెంలోని రామాలయం సిద్ధమవుతోంది. శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఉత్సవాలకు సంఘం కమిటీ ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఈ నెల 30న ఉగాది పర్వదినాన మొదలుకొని తొమ్మిది రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నారు. భద్రాదిలో నిర్వహించే విధంగా గత 6 దశాబ్దాలకు పైగా ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా సంఘం అధ్యక్ష దంపతులు పెండ్లి కూతురు, పెండ్లి కొడుకుగా సంఘంఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఉగాది రోజున ఆ దంపతులతో ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఉడుపు రాటను వేయడం, అనంతరం పెళ్లి పందిరిని ఏర్పాటు చేస్తారు. హనుమత్ సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలకు గ్రామంలోని ప్రజలు శుభ్రం చేసి, పాలు, నీలాభిషేకాలు చేయించి ఆలయంలో కొలువు ఉంచుతారు. అధ్యక్ష దంపతులు కంకణాలు ధరించి తొమ్మిది రోజుల పాటు నిష్ఠగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఈ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆఖరి రోజైన శ్రీరామనవమి రోజున తెల్లవారు జాము నుంచి భక్తులకు దర్శనాలు కల్పించి, ముహూర్త సమయానికి అధ్యక్ష దంపతులతో పాటు, పలు దంపతులతో ఈ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం, సాయంత్రం మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ హనుమత్ సీతారామలక్ష్మణులు ఉత్సవ విగ్రహాలను పలు వీధులలో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల మధ్య పరస మహోత్సవం,, పలు సాంస్కృతిక కార్యక్రమాలను సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

భద్రాది ముహూర్తానికే కల్యాణం..



ప్రతి యేటా భద్రాది రామచంద్రునికి నిర్వహించే ముహూర్తానికే (ఏప్రిల్ 6న ఉదయం 11.52 గంటలకు) సీతారాముల కల్యాణం జరుగుతుంది. ఇందులో భక్తులంతా ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు, అభిషేకాలు నిర్వహించుకుంటారు.

- రంపా రామ్మోహన్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు

సంప్రదాయబద్ధంగా ఉత్సవం



తమ పూర్వీకుల నుంచి వస్తున్న విధంగానే ఈ యేడాది ఇక్కడ శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. దీనికి తమ పక్క సంఘాలైన శెట్టి బలిజ సేవా సంఘం, యాదవ సేవా సంఘాల నుంచి భక్తులు పోటెత్తుతారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం

- కర్రి వెంకట సూర్యఅప్పారావు, అధ్యక్షుడు, శ్రీసీతారామ సేవాసంఘం

పెదజాలారిపేటలో అధ్వానంగా డ్రైనేజీలు



డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



దుర్గంధం భరించలేక చేపల మార్కెట్ వద్ద రేకులు కప్పి ఉంచిన కాలువ

పెదవాల్తేరు, మార్చి 25, (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ వద్ద గల వీధుల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో మురుగునీరు ప్రవహించక నిల్వ ఉండిపోతోంది. దీనివల్ల దోమలు, ఈగలలు పుట్టుకొచ్చి పరిసరాలు అపరిశుభ్రంగాతయారయ్యాయి. దుర్గంధం వెదజల్లుతోంది. పలు వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కాలువలు మీద పనికిరాని వస్తువుల, సామగ్రిని రాత్రివేళల్లో కొందరు బయటి వ్యక్తులు తెచ్చి పడేస్తున్నారని, దీంతో కాలువలు బ్లాక్ అయి మురగు పారడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందికి చెప్పినా వారు చూ సీ చూడనట్టు వెళ్లిపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసి నా అధికారులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి చేసిన నిందితులను శిక్షించాలి

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ డెలివరీ చేసిన యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ దక్షిణ భారత చైర్మన్ సన్నీ కృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో జరిగిన ఈ సంఘటన విచారకరమని, యువకుడిపై విచక్షణరహితంగా దాడి చేయడం హేయమన్నారు. అతడు తప్పు చేశాడని భావిస్తే,న్యాయపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప, దాడులు చేయడం ఏమిటని, ఇలాంటివి మళ్లీ జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్జీటీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా పరిధిలోని బీసీ, ఈడబ్ల్యుఎస్(ఈబీసీ) వర్గాలకు చెందిన డీఎస్సీ(ఎస్జీటీ) సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షకు అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రెండు లక్షల రూపాయలకు మించకూడదని పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు అభ్యర్థులు తమ పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, డీఎస్సీకి ఎంపిక అయిన టెట్ మార్కుల జాబితా, రెండు ఫొటోలను దరఖాస్తుతో జత చేసి, ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్దనున్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబరు : 94925 69177 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

27 నుంచి నూకాంబిక అమ్మవారి మహోత్సవాలు



వెంకోజీపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వేంచేసి ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి 13వ జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి జరుగనున్నట్లు ఆలయ చైర్మన్ బుగత సత్యనారాయణ తెలిపారు. 27న తోలేలు, 28న అమావాస్య మహోత్సవం, 29న మిగులు అమావాస్య, 30న ఉగాది మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొఅమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్,గాజులను సమర్పించుకోవాలని కోరారు.

పరీక్ష సమయాల్లో మార్పులు

ఆరిలోవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా శ్రీకృష్ణాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష తేదీల్లో మార్పులు చేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి ఈ నెల 13న ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు, జూనియర్ ఇంటర్‌కు 13- 04--2025 మధ్యాహ్న రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వైసీపీ బలోపేతానికి కృషిచేయాలి

పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మద్దిలపాలెం, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బలోపేతానికి యువజన నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యూత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు మభ్యపెట్టి కూటమి పార్టీలు విజయం సాధించాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులను టార్గెట్ చేస్తూ కేసులు పెడుతోందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం వల్ల ఇబ్బందిపడే ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసీపీకి మళ్లీ మంచి రోజులు వస్తాయన్నారు. దొడ్డి కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం జక్కపూడి రాజాకు సన్మానం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ యువజన నేతలు కొండా రాజీవ్ గాంధీ, మెంట స్వరూప్, మారపు పృథ్వీరాజ్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్ఎల్‌సీ సమక్షంలో ఉక్కు కాంట్రాక్టు కార్మిక నాయకుల సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై బుధవారం రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలోయాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల మధ్య కీలక సమావేశం జరగనున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సమావేశం అత్యంత కీలకంగా మారింది. స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల ఏడున కాంట్రాక్టు కార్మికుల సమ్మె చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో యాజమాన్యంతో కార్మిక సంఘాల నాయకుల సమావేశమై సమ్మెను వాయిదా వేశారు. అనంతరం 11న ఆర్ఎల్‌సీ సమక్షంలో సమావేశం జరిగినప్పటికీ అసంపూర్ణంగా చర్చలు జరగడంతో బుధవారానికి వాయిదా పడింది. 28న ప్లాంటులో సమ్మె చేస్తామని కార్మిక నాయకులు ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది.

అప్రమత్తత, అవగాహనతోనే క్షయ నిర్మూలన

» ఆరిలోవ రిఫరల్ వైద్యశాల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అనిత



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది

ఆరిలోవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్మూలన కేవలం అప్రమత్తత, అవగాహనతోనే సాధ్యమని ఆరిలోవ రిఫరల్ వైద్యశాల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అనిత పేర్కొన్నారు. యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత మాట్లాడుతూ తరచూ దగ్గు, జ్వరం వచ్చినట్టయి ఉచితం టీబీ టెస్ట్ చేయించుకోవాలన్నారు. మందులు ఉచితంగా ఇస్తారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో డాక్టర్ వేంకటేశ్వరరావు, జనరల్ ఫిజీషియన్, డెంటల్ సర్జన్ డాక్టర్ రాగ సుధ, పీడియాట్రిషియన్ డాక్టర్ వెంకటేశ్వరావు, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

ఇరువైపులా పార్కింగ్‌తో నిండిపోతున్న రహదారి



వాహనాల రద్దీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వీఎస్ కృష్ణాశాల రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందిగా మారుతోందంటూ స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. జీవీఎంసీ 16వ వార్డు పరిధిలో ఉన్న ఈ రోడ్డులో లెక్కకు మించి బడ్డీలు ఏరాటు చేయడంతో పాటు వైసీపీ కార్యాలయం ఉండడంతో ఇక్కడ అధికంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. వైసీపీ కార్యాలయానికి వచ్చే ప్రజాపతినిధులు, నేతలు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి ఉంచుతున్నారు.మరోవైపు దుకాణలు అధికంగా ఉండడంతో కొనుగోలు కోసం వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. ఫలితంగా.. ఈ రోడ్డు ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో నిండిపోతున్నది. దీం తో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు కొన్ని చోట్ల పాడవడం కూడా ట్రాఫిక్ కష్టాలను మరింత పెంచుతున్నది. దీనిపై అధికారులు ఏమీ స్పందించడం లేదని స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కృష్ణా కళాశాల రోడ్డులో ట్రాఫిక్ కష్టాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భానునగర్‌లోని పార్కు స్థలం పరిశీలన

» ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికారులు



స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపణ ఉన్న వ్యక్తులు, స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

వెంకోజీపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, వెంటనే ఆక్రమణలను తొలగించి పార్కు స్థలాన్ని భానునగర్ అసోసియేషన్ నివాసులకు అప్పగించాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కాలనీ నివాసులంతా కలిసి విన్నవించుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడడంతో మంగళవారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి స్థలంలో కబ్జా చేశారని ఆరోపణ ఉన్న వ్యక్తులతో మాట్లాడారు. వెంటనే రీ సర్వేను చేయించి, రెండు మూడు రోజుల్లో కబ్జాలను తొలగించి, పార్కు స్థలాన్ని కాలనీ వాసులకు అప్పగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ ప్రభాకరరావు, ఏసీపీ మధుసూధనరావు, టౌన్ సర్వేయర్ తిరుమలరావు, సచివాలయం సిబ్బంది, కాలనీ వాసులు వంకా శివశంకర్, జి.వామనమూర్తి, పడాల రమణ, పడాల గోవింద్, కాంతం, మణి, దేవి, దేవుడమ్మ, లక్ష్మి, హైమా ఇతర కాలనీ వాసులు పాల్గొన్నారు.

చినవాల్తేరు మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్ రుద్ర తదితరులు

పెదవాల్తేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం పురష్కరించుకుని మంగళవారం చినవాల్తేరులోని మహమ్మదీయ మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజక వర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర విచ్చేశారు. ఈ సందర్భంగా మహమ్మదీయ మసీదు పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రతాప్ రుద్ర మసీదులో నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీతల అఖిల, జాఫర్, షరీఫ్, రఫీ, సత్తార్, ముస్తాఫా బాబా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బయలుదేరిన లఖ్‌నవూ జట్టు



విమానాశ్రయంలోకి వెళ్తున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు సభ్యులు

గోపాలపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు సభ్యులు తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న టీమ్ సభ్యులు హైదరాబాద్ వెళ్లారు. క్రికెట్ అభిమానులు వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలని తొమ్మిదో సెక్టరులో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులతో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ మరమ్మతులను చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాద్, పరశురామ్, రామారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా పూర్తి కాని డ్రైనేజీ పనులు



పాతవెంకోజీపాలెంలో తవ్వి వదిలేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

వెంకోజీపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం ప్రాంతంలో సుమారు రూ.50 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులను చేపట్టారు. పనులు చేపట్టి సుమారు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాకపోవడం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

కాగా, గత మూడు రోజులుగా పైపుల పునరుద్ధరణ కోసం గోతులను తవ్వేసి పూడ్చకుండానే వదిలేశారు. ఈ మార్గం మూడు అడుగుల రోడ్డు కావడం, అందులో గోతులు పూడ్చకుండా వదిలేయడంతో స్థానికులు రాకోపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభించి ఏడాది గడుస్తోంది. మధ్యలో ప్రధాన ఎన్నికల కోడ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వెరసి దాదాపు నాలుగు నెలలు గడిపోయింది. మిగిలిన 8 నెలలోనే ఈ పనులు పూర్తి చేశారా? అంటే అదీ కూడా సిబ్బంది పూర్తి చేయకపోగా గోతులను తవ్వేసి అసంపూర్తిగా వదిలేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పునరుద్ధరణ పనులను పూర్తి చేసి, గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్

ఎన్ఆర్ఐ సంబంధాల పేరుతో వల

- వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ ఆధారంగా సైబర్ నేరగాళ్ల మోసాలు
- బాధితుల్లో మహిళలే అధికం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న సైబర్ క్రైమ్ పోలీసులు

- అమెరికా, కెనడాలో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నామంటూ పరిచయం
- విదేశీ సంబంధాల మోజులో మోసపోతున్న బాధితులు
- ఇటీవల కాలంలో మళ్లీ నమోదవుతున్న కేసులు
- పరువుపోతుందని చెప్పుకోలేకపోతున్న బాధితులు
- కొద్దిమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'మధురవాడలో నివసిస్తున్న ఓ వైద్యురాలికి 30 ఏళ్లు నిండినా వివాహం కాలేదు. మంచి సంబంధం కోసం ఓ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ అప్‌లోడ్ చేశారు. అమెరికాలో వైద్యుడినంటూ ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి పరిచయం చేసుకున్నారు. తన తల్లిదండ్రులు వైద్యులేనని, ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారని నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని, కలిసేందుకు ఇండియా వస్తున్నాననని విమానం టికెట్టు కూడా వాట్సాప్‌లో పంపించాడు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారంటూ ఎవరితోనో మాట్లాడించి దశల వారీగా రూ.ఐదు లక్షలు గుంజేశాడు.'

'నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగిని రెండో పెళ్లి కోసం మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ పెట్టారు. ఆ తరువాత ఓ వ్యక్తి ఫోన్‌చేసి తాను అమెరికాలో వుంటున్నానని, పెళ్లి చేసుకుని ఇండియాలో సెటిల్ అయిపోదామనుకుంటున్నానని చెప్పాడు. ఆమె కూడా మొగ్గుచూపింది. విలువైన బహుమతులు తీసుకు వస్తుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో నిర్బంధించారని, తన వద్ద ఇండియా కరెన్సీ లేదని చెప్పడంతో ఆమె రూ.4.82 లక్షలు అతని ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.'

నగరంలో మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్ ఇటీవల మళ్లీ పెరుగుతున్నాయి. పెళ్లి కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ప్రొఫైల్ పెట్టే మహిళలే బాధితులుగా మారుతున్నారు. వారిలో కూడా బాగా చదువు, ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ మంచి సంబంధాలు రాని యువతులు, రెండో పెళ్లి కోసం ప్రయత్నించే మహిళలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటివారి ప్రొఫైల్స్‌ను మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో పరిశీలిస్తున్న మోసగాళ్లు తాము అమెరికా, కెనడా వంటి దేశాల్లో దశాబ్దాల కిందటే సెటిల్ అయిన కుటుంబాలకు చెందిన ఎన్ఆర్ఐలమంటూ పరిచయం చేసుకుని ముగ్గులోకి దింపుతున్నారు. వైద్య వృత్తి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ మాటలు కలుపుతున్నారు. ఆర్థికంగా స్థితిమంతులమని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కుటుంబసభ్యులు ఇష్టపడతారు కాబట్టి భారతీయురాలిని పెళ్లి చేసుకుంటామని నమ్మిస్తున్నారు. అమెరికా సంబంధం, అందులోనూ ఆర్థికంగా ఉన్నవారు అనేసరికి వారిమాయలో పడిపోతున్నారు. వారి కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోతున్నారు. నైజీరియా, చైనా, కొలంబియా వంటి దేశాలకు చెందిన కొందరు సైబర్ నేరాలే వృత్తిగా భారతీయులను మోసం చేసి డబ్బు గుంజేస్తున్నారు.



మ్యాట్రిమోనీ సైట్స్ లక్ష్యం

ప్రస్తుతం పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో ప్రొఫైల్ పెట్టడం సాధారణంగా మారింది. దీంతో ఆయా వెబ్‌సైట్లనే మోసాలకు ఆసరాగా మార్చుకుంటున్నారు. వాటిలో అప్‌లోడ్ చేసిన ప్రొఫైల్‌లోని ఫోన్ నంబర్‌కు విదేశీ నంబరుతో ఫోన్ చేసి తాము అమెరికా, కెనడా తదితర దేశాలకు చెందినవారిగా పరిచయం చేసుకుంటున్నారు. వైద్యుడిగానో, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గానో స్థిరపడి, భారీగా సంపాదిస్తున్నానని, తల్లిదండ్రులు కూడా స్థితిమంతులని ఆకట్టుకుంటున్నారు. భారతీయ మహిళను పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి ఉందంటూ వల విసురుతున్నారు. విలాసవంతమైన ఇంట్లో నివసిస్తున్నామని, ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన ఫొటోలను వాట్సాప్‌లో పంపిస్తున్నారు. ఎలాంటి కట్టుబాట్లు వుండవని, ఎవరి అభీష్టం మేరకు వారు జీవితం గడపవచ్చని ఆకర్షిస్తున్నారు. వారుచెప్పిందంతా నిజమేననే భ్రమలో మరో ఆలోచనలేకుండా సంబంధం కుదుర్చుకునేందుకు కొంతమంది మహిళలు పరితపిస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్ పేరుతో గిమ్మిక్కులు

పెళ్లి ఇష్టమైతే తానే ఇండియా వచ్చి మాట్లాడతానంటూ మోసగాళ్లు వలలోకి లాగుతున్నారు. వచ్చినపుడు ఖరీదైన బహుమతులు తెస్తాననడం, నమ్మకం కలిగించేందుకు విమాన టికెట్లను వాట్సాప్‌లో పంపడంతో బాధితులు ఆశగా ఎదురుచూస్తుంటారు. రెండు రోజులు గడిచిన తర్వాత విమానంలో కూర్చున్న ఫొటోలను పంపిస్తున్నారు. కొంతసేపటికే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దిగానని, అమెరికన్ కరెన్సీతోపాటు తనవెంట తెచ్చిన ఖరీదైన బహుమతులను సీజ్ చేశారని కట్టుకథ అల్లుతున్నారు. విడిచిపెట్టాలంటే జరిమానా చెల్లించాలని మభ్యపెడుతున్నారు. కస్టమ్స్ అధికారులు మాట్లాడుతారంటూ ఎవరికో ఫోన్ ఇచ్చి మాట్లాడిస్తున్నారు. ఇదంతా నిజమేనని భ్రమించిన బాధితులు వారు చెప్పిన ఖాతాకు నగదు బదిలీ చేస్తున్నారు. ఇలా వీలైనంతవరకు లాగేసి, బాధితులకు అనుమానం వచ్చిన తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



ఇటీవలి సంఘటన

మధురవాడలోని ఓ వైద్యురాలు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ప్రొఫైల్ చూసి, అమెరికా నుంచి అంటూ ఓ ఫోన్ వచ్చింది. తనకు సంబంధం నచ్చిందని, ఇండియా వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో నిజమేనని నమ్మారు. తర్వాతరోజు ఢిల్లీలో తనను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని మోసగాడు ఫోన్‌చేశాడు. తనవద్ద ఇండియన్ కరెన్సీ లేకపోవడంతో ఇరుక్కుపోయానని నమ్మబలికాడు. దీంతో వైద్యురాలు రూ.2.1 లక్షలు సైబర్‌నేరగాడు చెప్పిన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత కొంతసేపటికి తనవద్ద ఉన్న బహుమతులకు పన్ను కట్టాలని, లేదంటే సీజ్‌చేస్తామంటున్నారని ఫోన్‌చేయడంతో తన వద్ద డబ్బులేదని వైద్యురాలు చెప్పేశారు. దీంతో కస్టమ్స్ అధికారి పేరుతో వేరొకరితో మాట్లాడించాడు. ఎవరివద్ద అయినా తీసుకుని గండం గట్టెక్కిస్తే తాను వచ్చాక ఇండియన్ కరెన్సీలోకి మార్చి వెనక్కి ఇచ్చేద్దామని నమ్మించాడు. దీంతో రూ.3 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను విత్‌డ్రా చేసి ట్రాన్స్‌ఫర్ చేశారు. అయినా మళ్లీ డబ్బులు అడగడంతో అనుమానం వచ్చి స్నేహితుల ద్వారా ఆరా తీయగా అదంతా మోసమని తేలింది. దీంతో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదుచేసి ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌కు ఆత్మీయ వీడ్కోలు



విమానాశ్రయంలోకి వెళ్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

గోపాలపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విమానాశ్రయంలో అధికారులు వీడ్కోలు పలికారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్‌కు అధికారులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా విజయవాడ వెళ్లారు.

క్రైం... crime news

భవనం పైనుంచి జారిపడి పెయింటర్ మృతి

- హెల్పర్‌కు తీవ్ర గాయాలు



రామకృష్ణ (ఫైల్ ఫొటో)

సింధియా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి జారిపడిపోవడంతో పెయింటర్ మృతి చెందగా, సహాయకుడు గాయపడ్డాడు. ఈ సంఘటన సోమవారం పారిశ్రామిక ప్రాంతంలోని 63వ వార్డు పరిధి చింతలలోవ గ్రామంలో జరిగింది. గ్రామంలో మూడంతస్థుల భవనానికి పెయింటర్ సంగిరెడ్డి రామకృష్ణ (23), హెల్పర్ కిరణ్‌కుమార్ పెయింటింగ్ వేస్తుండగా, అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం రామకృష్ణ మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల పిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా భవనంపై బాడా తాడు పట్టుకున్న హెల్పర్ కిరణ్ కుమార్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ఆరిలోవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన హనుమంతవాక కూడలిలో మంగళవారం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరికి చెందిన గణపతి రంభ (59) కొంతకాలంగా స్థానిక మేస్త్రి వద్ద పనిచేస్తోంది. మంగళవారం గోడలకు వాటరింగ్ చేస్తుండగా విద్యుత్ మోటారుకు ఆనుకుని ఉన్న పైపును పట్టుకోవడంతో కుప్పకూలిపోయింది. సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి విమ్స్ తరలించాలని సూచించారు. అక్కడికి చేర్చేసరికి రంభ మృతిచెందింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కృష్ణ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. మద్దిలపాలెం సమీపంలోని కేఆర్ఎం కాలనీకి చెందిన లింగం నరసింహారావు పుచ్చకాయల దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం కోలా సురేష్ మద్యం మత్తులో దుకాణానికి వచ్చి కత్తితో దాడి చేశాడు. అక్కడ ఉన్న కోలా నాని అడ్డుకోవడానికి ప్రయత్నించగా అతడిపైనా దాడి చేశాడు. దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం, కృష్ణాకళాశాల రోడ్డుకి చెందిన ముత్యాల బంగారు రాజు(43) కనిపించకుండా పోయాడని ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. ముత్యాల లక్ష్మి తన భర్త ఈ నెల 22 వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదని ఫిర్యాదు చేసింది. దంపతుల మధ్య వివాదాల కారణంగా బంగారు రాజు ఇంట్లో ఫోను వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిపింది. ఈ మేరకు ఏఎస్ఐ సత్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఎంవీపీ కాలనీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాలిక కనిపించకుండా పోయిందని ఆమె తండ్రి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు అప్పుఘర్‌కు చెందిన గుంటి వీర్రాజు పెద్ద కుమార్తె గుంటి కుమారి (17) సోమవారం ఇంట్లో నుంచిబయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌తో ఎక్కువగా గడుపుతోందని తల్లి మందిలించడంతో మనస్తాపానికి గురై బయటకు వెళ్లిపోయిందని తెలిపాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని చూసే వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరుతున్నారు

- టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, మూర్తియాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు మూర్తియాదవ్, పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరుతున్నారని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, పీతల మూర్తియాదవ్ అన్నారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జీవీఎంసీలో వైసీపీ పాలకమండలి నాలుగేళ్ల హయాంలో నగరాభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. అవినీతి, అక్రమాలే పరిమావధిగా పాలన సాగించారన్నారు. వార్డుల్లో అభివృద్ధి జరగడం లేదని స్వయంగా వైసీపీ కార్పొరేటర్లే ఆరోపించడం దీనికి నిదర్శనమన్నారు. ఈ నేపథ్యంలో వారంతా స్వచ్ఛందంగా కూటమి పార్టీల్లో చేరుతుంటే నైతికవిలువలు గురించి మాట్లాడుతున్నారని, వైసీపీ నాయకులకు నైతికత గురించి మాట్లాడే హక్కులేదన్నారు. 31వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వానపల్లి రవికుమార్ మరణిస్తే ఆ వార్డుకి జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని నిలబెట్టనప్పటికీ, ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన వ్యక్తిని వైసీపీ అభ్యర్థిగా ప్రకటించి దౌర్జన్యంగా కైవశం చేసుకున్నారని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాలకు వైసీపీ కార్పొరేటర్లు వస్తారో రారో? చెప్పాలన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పీఠాన్ని కైవశం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. స్థాయీ సంఘం ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసినపుడే మేయర్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఉంటే గౌరవంగా ఉండేదన్నారు. జీవీఎంసీలో జరిగిన అవినీతిని బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ గల్లా చిన్న ఇతర నేతలు పాల్గొన్నారు.

బీసీ మహిళ మేయర్‌గా ఉండడం కూటమికి ఇష్టం లేదా?

- శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న బొత్స

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్‌గా బీసీ మహిళ ఉండడం కూటమి నేతలకు ఇష్టంలేదేమోనని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బీచ్‌రోడ్డులోని క్యాంప్‌కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాస తీర్మా నం నోటీసు ఇవ్వడం సరికాదన్నారు. బీసీ మహిళనుమేయర్ పీఠం నుంచి తొలగించాలని టీడీపీ యత్నిస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో బలహీనవర్గాల మహిళలకు ఎలాంటి గౌరవం ఇస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నా రు. అసెంబ్లీలో సాంస్కృతిక కార్యక్రమాల పేరు తో పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు. ఒకరిని కించపరిచేలా వ్యవహరిస్తున్నపుడు పెద్దలు అభ్యంతరం చెప్పాల్సిందని అభిప్రాయపడ్డారు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే ఆదుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని విమర్శించారు. మిర్చి కొనేవారు లేక యార్డుల్లో నిల్వలు పేరుకుపోయాయన్నారు. రాయలసీమలో ఈదురుగాలులతో అరటిపంట దెబ్బతింటే, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. ఉత్తరాంధ్రలో చెరకు రైతులకు గిట్టుబాటు ధరలేక పంటను తగలబెట్టుకుంటుంటే ప్రభుత్వం నిద్రపోతోందన్నారు. చోడవరం షుగర్స్‌లో 89వేల టన్నులు చెరకు క్రషింగ్ జరిగినా రైతులకు ఒక్కరూపాయి కూడా చెల్లింపులు జరపలేదన్నారు. రైతు సమస్యలను పరిష్కరించకుంటే రైతుపోరు పేరుతో తమపార్టీ ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలపై కేసు నమోదు చేయాలి

- ఈడీకి ఫిర్యాదు చేసిన విదసం



ఫిర్యాదు కాపీని చూపిస్తున్న విదసం సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో వెలుగుచూసిన సగం కాలిన నోట్ల కట్టల వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ చేపట్టాలని విశాఖ దళిత హక్కుల సంఘం (విదసం) ఫిర్యాదు చేసింది. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులోని సౌత్ రీజనల్ సబ్ జోనల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ నరేంద్రకు మంగళవారం ఫిర్యాదు అందజేశారు. అనంతరం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాల ఆధారంగా ఢిల్లీ హైకోర్టు అంతర్గత విచారణ నివేదిక, ఢిల్లీ పోలీసు కమిషనర్ నివేదిక మేరకు యశ్వంత్ వర్మ ఇంట్లో అక్రమ నగదు ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలున్నాయని, న్యాయమూర్తిని కేవలం బదిలీతో సరిపెడితే న్యాయానికే న్యాయం జరగదన్నారు. న్యాయమూర్తి ఇంట్లోకి రూ.కోట్లు విలువైన నోట్లు ఎలా వచ్చాయి, ఏ ప్రయోజనాన్ని ఆశించి ఎవరు ఇచ్చారు, ఈ నగదు లావాదేవీలో ఎన్ని తీర్పులు ప్రభావితం అయ్యాయి, ఎంతమంది నిర్దోషులుగా బయటపడ్డారు, అన్యాయంగా ఎంతమంది నిర్దోషులు జైళ్లకు పోయారో నిగ్గు తేల్చేందుకు ఈడీ, సీబీఐ రంగంలోకి దిగి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నైతిక బాధ్యత వహిస్తూ భారత న్యాయశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కన్వీనర్లు సోడదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ బజారు కార్యాలయంలో డీసీఓ ప్రవీణ

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజారు) ఎండీ శ్రీనివాసరాజును కమిషనరేట్‌కు సరండర్ చేయడంతో ఆ బాధ్యతలను జిల్లా సహకార శాఖ అధికారిణి ప్రవీణకు అప్పగించారు. ఆయన సోమవారం రిలీవ్ కావడంతో ప్రవీణ మంగళవారం సూపర్ బజారుకు వెళ్లి అన్ని విషయాలు పరిశీలించారు. సాయంత్రం ఆరు గంటల వరకు అక్కడే ఉన్నారు. ఇంకా బాధ్యతలు తీసుకోలేదని, బుధవారం స్వీకరిస్తానని, జాయింట్ కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉందని చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని నుంచి 10.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిశ్రీ తనిఖీలు చేస్తుండగా మధ్యప్రదేశ్‌కు చెందిన గజానన్ కుర్సేంగే గంజాయితో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి

- రహదారులు ఊడ్చి కాంట్రాక్టర్ల నిరసన



రహదారులు ఊడ్చి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

సిరిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారనే రహదారులపై గుంతలు పూడ్చామని బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ఆర్అండ్‌బీ, పీఆర్, ఐఅండ్ సీఏడీ, మునిసిపల్ కాంట్రాక్టర్లు కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం, ఉత్తరాంధ్ర కాంట్రాక్టర్స్ మునిసిపల్, ఎస్ఏబీసీఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం రహదారులు ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది కాంట్రాక్టర్లు ఆరు సంవత్సరాలుగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి వీలుగా సీఎఫ్ఎంఎస్ నిధి పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏజ్‌వైజ్ ఎఫ్ఐఎఫ్ఓ ప్రాతిపదికన చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ నిరసనలో వైజాగ్ స్టీల్‌సిటీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, ఎస్ఏబీసీఏ ప్రతినిధులు సూర్యప్రకాశ్, సాధూరావు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.